RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 217 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 ఆగష్టు 2024 గురువారం పేజీలు : 4

## రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీష్ కుమార్

### ఆ పదవి చేపట్టనున్న తొలి దళిత అధికారి

న్యూఢిల్లీ : రైల్వే బోర్డు చైర్మన్-సీఈఓగా ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసు(ఐఆర్‌ఎంఎస్) అధికారి సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ పదవి చేపట్టనున్న తొలి ఎస్సీ అధికారి ఆయనే కావడం విశేషం. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జయ వర్మ సిన్హా ఈ నెల 31న పదవీ విరమణ చేసిన అనంతరం సతీష్ కుమార్ ఆ బాధ్యతలు చేపట్టనున్నారు. సతీశ్ ప్రస్తుతం ఆయన రైల్వే బోర్డు మెంబర్(ట్రాక్షన్-రోలింగ్ స్టాక్)గా ఉన్నారు.




## నిరుపేదలకు శుభవార్త...

# ఇందిరమ్మ ఇండ్ల డిజైన్ రెడీ!

హైదరాబాద్ : ఈ నెలాఖరులోపే ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌ను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లను అందజేస్తామని వెల్లడించారు. దీంతో అధికారులు ఇండ్లకు సంబంధించి డిజైన్ పై కసరత్తు స్పీడప్ చేశారు. వరుస సమావేశాలు నిర్వహించి.. ఇప్పటికే నాలుగైదు రకాల డిజైన్లు రెడీ చేసినట్టు తెలిసింది.

సదరు డిజైనర్లపై హౌజింగ్ శాఖ మంత్రి సమీక్షించి, ముఖ్యమంత్రికి నివేదించి.. అప్రూవల్ పొందిన తర్వాతే ఫైనల్ చేయనున్నట్లు తెలిసింది. ఈఅంశంపై త్వరలోనే హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి సమీక్షించనున్నట్లు సమాచారం.

**పాత డిజైన్లకు సమీపంలో..** ఇందిరమ్మ ఇండ్ల పాత డిజైన్లకు సమీపంలోనే కొత్త డిజైన్ ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంటి నిర్మాణంలో 'కాంగ్రెస్ రికగ్నైజేషన్' కనిపించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. డిజైన్లు రూపొందించే ముందు ఈ అంశాన్ని గమనంలోకి తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్టు సమాచారం.

అయితే పాత డిజైన్ నుంచి లోగో, కలర్లను స్వీకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కేంద్రం సహకారంతో ఇండ్లు నిర్మిస్తే తాము రూపొందించిన లోగోను ఇండ్లపై తప్పనిసరిగా ఉండాలని కేంద్రం షరతు విధించింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ కోసం ప్రభుత్వం లోగోను ప్రభుత్వం తయారు చేయిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉండే గోడలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లోగోలను ముద్రించాలా అన్న దానిపై అధికారులు చర్చిస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల స్కీమ్స్‌పై స్టడీ!..** వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలపై అధికారులు స్టడీ చేస్తున్నట్టు తెలిసింది. అక్కడికి నేరుగా వెళ్లకుండా ప్రాథమికంగా ఇక్కడి నుంచే అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ విషయమై అధికారులకు హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

పథకం అమలులో ఆయా రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవటం ద్వారా తెలంగాణలో పథకాన్ని పకడ్బందీగా అమలు అవకాశముంటుందని తెలిపారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో అధికారులు ఎప్పుడు పర్యటిస్తారన్న దానిపై క్లారిటీ లేదు.

**నిధుల సమీకరణ సవాలే...** ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ కింద ఒక్కో ఇంటికి దశలవారీగా రూ. 5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. అయితే, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో 80 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. అందులో నుంచి అనర్హులను తొలగించి, అర్హులతో జాబితా తయారుచేసిన తరువాత ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్టు సమాచారం. అందుకు కావాల్సిన నిధుల సమీకరణ కూడా ప్రభుత్వ ఒక సవాలే కానుంది. మరోవైపు, 4.5 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసేందుకు రూ. 22,500 కోట్లు అవసరం కానున్నాయి.

అయితే, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 7,740 కోట్లు మాత్రమే కేటాయించారు. రిలైజ్డ్ ఎస్టిమేషన్స్ లో పెంచుతారా లేదా అన్న దానిపై సందిగ్ధత నెలకొన్నది. ఇక హౌజింగ్ శాఖ హడ్కో నుంచి రూ. మూడు వేల కోట్లు సేకరించాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి రూ. 1.5 లక్షల చొప్పున నిధులు అందే అవకాశముంది.
అయినప్పటికీ మరో రూ. 5,000 కోట్ల వరకూ లోటు ఏర్పడనుంది. దీనిపై ఎలా ముందుకు వెళతుందన్నది తేలాల్సి ఉన్నది.




హైదరాబాద్: ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తుందని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైదరాబాద్ బంజరాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్న కవితకు పార్టీశ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.


"న్యాయబద్ధమైన పోరాటం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది. నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి.. కచ్చితంగా ఒక రోజు న్యాయం గెలుస్తుంది. నిజం నిలకడమీద తెలుస్తుందని తెలంగాణ ప్రజలకు తెలియజేస్తున్నా. కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటకు వస్తా. ప్రజా క్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తాం. నిజం కోసం పోరాటం చేస్తూనే ఉంటా" అని కవిత అన్నారు.

**శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం**... ఎమ్మెల్సీ కవిత దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. కవిత వెంట కేటీఆర్, హరీశ్‌రావు, కుటుంబ సభ్యులు ఉన్నారు. దిల్లీ మద్యం విధానం కేసులో ఐదున్నర నెలలు తిహాడ్ జైలులో ఉన్న ఆమె మంగళవారం బెయిల్ మీద విడుదలైన విషయం తెలిసిందే. ఐదు నెలల తర్వాత హైదరాబాద్ చేరుకున్న కవితకు పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి.



## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇంజినీరింగ్ కళాశాలలకు నోటీసులు ఇచ్చారు. దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలకు రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారని అందులో పేర్కొన్నారు.




# రేవంత్ దూకుడు...

## బలమా.. బలహీనతా...!?

## తెరవెనుక ఏం జరుగుతోంది?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మాటలు కోటలు దాటుతున్నాయి. నేతలు నిగ్రహం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇంకా తాము ప్రతిపక్షంలోనే ఉన్నామన్నట్లు వ్యవహరిస్తుండగా, అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నేతలు తాము ఇంకా అధికారంలో ఉన్నామన్న భావనలోనే అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ఈధోరణి అధికార పార్టీ నేతల్లో మరింత అసహనం పెంచుతోంది. అధికారంలో లేకపోయినా అధికారంలో ఉన్న నేతలను ధూషించడాన్ని సహించలేకపోతున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలను అటాక్ చేస్తున్నారు. విపక్షంలో ఉన్నపట్టిలాగే దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తన పదునైన మాటలతో చీల్చి చెండాడుతున్నారు. అధికారం చెప్పట్టినప్పటి నుంచి ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి వస్తామని బెదిరించడంతో ముందుగా బీఆర్‌ఎస్ పార్టీనే సగం ఖాళీ చేసేసి కేసీఆర్‌కు పెద్ద షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో కూడా బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బ కొడితేనే కేసీఆర్‌ని కట్టడి చేయగలమని గ్రహించి దెబ్బ తీసి, ఫామ్‌హౌస్‌లో నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారు.

**అనేక ఎదురుదెబ్బలు తిని..** బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో రాజకీయంగా ఎదిగారు. అంతకుముందు రాజకీయాల్లో ఉన్నా... తెలంగాణ ఉద్యమమే కేసీఆర్‌కు గుర్తింపు తెచ్చింది. ముఖ్యమంత్రిని చేసింది. ఇక రేవంత్‌రెడ్డి కూడా రాజకీయాల్లో అంత సుఖమైన ప్రయాణం సాగించలేదు. అనేక డక్కీమొక్కీలు తిన్నారు. టీడీపీలో ఓటుకునోటు కేసు.. కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి స్థాయికి వచ్చారు.

శ్రీరాముడు వానర సైన్యంతో మహా శక్తిశాలి అయిన రావణుడిని వదించిన్నట్లే, తన మాట అసలు వినని వానర సైన్యం వంటి కాంగ్రెస్ నేతలను వెంటబెట్టుకొని రేవంత్ రెడ్డి, రాజకీయాల్లో అపర చాణక్యుడని పేరు గుర్తింపు ఉన్న కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించారు. పామ్‌హౌస్‌కు పరిమితం చేశారు.

**ఆ ఇద్దరూ కొరకరాని కొయ్యలా..** కేసీఆర్ అంతటివాడిని రేవంత్ రెడ్డి ఓడగొట్టారనే విషయం మరిచిన కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యలా తయారయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. సబ్జెక్ట్, లెక్కల ఆధారంగా రేవంత్‌రెడ్డిని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డికి కావలసింది కూడా అదే. లేకుంటే ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యల జాబితా కొండంత ఉంది. కేటీఆర్, హరీశ్‌రావుతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు పోరాటాలు చేస్తూ ప్రజల దృష్టిని సమస్యలపై నుంచి మళ్లిస్తున్నారు. ఇక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోయినా, రేవంత్ రెడ్డి దూకుడు, వ్యూహాలను, వైఫల్యాలను నిశితంగానే గమనిస్తున్నారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చేశాక కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి దూకుడుకి చెక్ పెడతారని తెలుస్తోంది. ఆ ప్రయత్నంలోనే కేసీఆర్ బీజేపీ పెద్దలతో తెర వెనుక రాయబారాలు నడుపుతున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపిస్తున్నారు. అంటే కేసీఆర్ వలన ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డి కూడా గ్రహించిన్నట్లు భావించవచ్చు. అందుకే కాంగ్రెస్ మంత్రులు కోరుకుంటున్న స్వేచ్ఛ, గౌరవం, ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ఎవరూ పక్క చూపులు చూడకుండా జాగ్రత్తపడుతున్నారు.

**బీజేపీ-బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేలా..** బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చేతులు కలిపినా ఎదుర్కొనేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ కలవకూడాదనే తరచూ కుమ్మక్కు ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ కలిస్తే అప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయం కూడా రేవంత్ రెడ్డి చాలా ముందే పసిగట్టారని చెప్పవచ్చు.

అందుకే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అభినందనలు తెలిపి విభజన సమస్యలపై చర్చలకు ఆహ్వానించారని అనుకోవచ్చు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఉండటం చంద్రబాబు నాయుడుకి ఎంత ముఖ్యమో, అదేవిదంగా ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడుగా ఉండటం రేవంత్‌రెడ్డికి కూడా అంతే అవసరం. అప్పుడే వారు తమ ఉమ్మడి శత్రువులు జగన్, కేసీఆర్‌ను కట్టడి చేయగలుగుతారు. అందుకే రేవంత్ రెడ్డి కాస్త దూకుడుగానే ముందుకు సాగుతున్నారు. ఈ దూకుడు, వ్యూహాలు, అప్రమత్తం మాత్రమే సరిపోదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు తీర్చడం కూడా చాలా అవసరం.

# సంపాదకీయం

## హైదరాబాద్ ఇకపై 'హైడ్రా'బాద్ అవుతుందేమో?

'అదేదో హైడ్రా అట కద.. హైదరాబాద్ లో చెరువులను మింగేసి ఇళ్లు కట్టిన పెద్దపెద్ద వాళ్ల భరతం పడుతోందట.. అలాంటి మన ఊరిలోనూ ఉంటే బాగు..' తెలంగాణలోని ఓ సాధారణ గ్రామంలో చాయ్ బండి దగ్గర కొందరి ముచ్చట... "సారూ.. మా ఊరిలో ఒకప్పు 8 ఎకరాల్లో చెరువు ఉండేది.. కబ్జా చేసి వెంచర్లు వేశారు. దానిని వెదికి పెట్టండి".. తుమ్మలచెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్ లో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామస్థుల ఫిర్యాదు. ఇదీ ప్రస్తుతం హైదరాబాద్ లోనే కాదు తెలంగాణ వ్యాప్తంగా నడుస్తున్న చర్చ.. కమిషనర్ ఏవీ రంగనాథ్ సారథ్యంలో.. ఆక్రమణలపై దూకుడుగా వెళ్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) బడాబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. గత ఆదివారం కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, కావేరీ సీడ్స్ యజమాని భాస్కర్ రావు, ప్రో కబడ్డీ లీగ్ ఓనర్ శ్రీనివాస్ భార్య అనుపమ తదితరులు గండిపేట చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ లో ఎకరాలకు ఎకరాలు ఆక్రమించి కట్టిన ఫాంహౌస్ లను నేల మట్టం చేసింది. నిన్నటికి నిన్న సినీ నటుడు నాగార్జున కట్టిన ఎన్ కన్వెన్షన్ ను తెల్లారేసరికి కూల్చేసింది. మొత్తం మూడు నెలల్లో... రాజధానిలో చెరువులు, పార్కు స్థలాలు ఆక్రమించి 18 చోట్ల చేపట్టిన 166 నిర్మాణాలను పడగొట్టామని హైడ్రా ప్రభుత్వానికి నివేదించింది. చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం(ఎఫ్ టీఎల్), బఫర్ జోన్ లో నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా ఏర్పాటైనప్పటి నుంచి చేపట్టిన చర్యలపై సర్కారుకు నివేదిక సమర్పించింది.

**స్వచ్ఛందంగా ఫిర్యాదులు..** హైడ్రా రంగంలోకి దిగాక హైదరాబాద్ వ్యాప్తంగా చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతల నుంచి స్వచ్ఛందంగా ఫిర్యాదులు అందుతుండడం గమనార్హం. అంతేకాదు.. ప్రజాప్రతి నిధుల అక్రమ నిర్మాణాలకు సంబంధించి డ్రోన్ చిత్రాలను 'ఎక్స్'లో పోస్ట్ చేస్తున్నారు. వాటిని సైతం కూల్చాలని హైడ్రాను డిమాండ్ చేస్తున్నారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీల నాయకుల నివాసాలు ఉండడం చెప్పుకోదగ్గ అంశం.

**మా ఊరికీ కావాలి ఓ హైడ్రా..** నిజాయతీపరుడైన అధికారిగా పేరున్న కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో హైడ్రా చేపడుతున్న కూల్చివేతలను సహజ వనరుల రక్షణ పట్ల ఆపేక్ష ఉన్నవారిని ఆకట్టుకుంటోంది. దీంతోపాటు తమ కళ్లెదుటే ఆక్రమణలకు గురైన చెరువులు, నీటి కుంటలను చూసి సాధారణ ప్రజలూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే తమ గ్రామానికీ హైడ్రా రావాలంటూ ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు కొందరు హైదరాబాద్ త్వరలో 'హైడ్రా'బాద్ కానుదంటూ సందర్భోచితంగా స్పందించారు.

**కొసమెరుపు:** కొన్ని దశాబ్దాల కిందట డిగ్రీ చదివిన యువత ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చేవారు. ఎక్కడ ఉన్నావని ఎవరైనా అడిగితే హైడ్రాబాద్ అని చెప్పేవారు. వారు అప్పుడు వ్యవహారికంలో అలా అన్నప్పటికీ ఇప్పుడదే సార్థకమయ్యేలా ఉంది.

# వర్షపు నీరుతో నాలాలు, రోడ్లు నిండకుండా చర్యలు చేపట్టండి...

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : సాధారణ వర్షపాతానికి రోడ్ల పై నీరు నిలువకుండా నాలాల పూడికలు తీయడమే కాకుండా వర్షపు నీరు వెళ్లే మార్గలను సుగమం చేయాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ విసి హాల్ లో జరిగిన జిల్లా రహదారి భద్రత సమావేశంలో అదనపు జిల్లా కలెక్టరు రాధికా గుప్తాతో కలిసి కలెక్టరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, ట్రాఫిక్, మున్సిపాలిటి, ఆర్ అండ్ బి, ఎన్ హెచ్ సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా లోని రోడ్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాద స్థలాలను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టరు ఆదేశించారు. చిన్నపాటి వర్షానికి రోడ్ల పై నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ట్రాఫిక్ అధికారులకు కలెక్టరు సూచించారు. జిల్లాలోని ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు సరైన ప్రణాళిక రూపొందించి తద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 19యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని ట్రాఫిక్ ఎసిపి తెలుపగా, వాటికి తీసుకోవలసిన చర్యలను కలెక్టర్ వివరించారు. ఈ సంవత్సరం జరిగిన ప్రమాదాలు, మరణాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలకు కారణలైన అధిక స్పీడు, ఇరుకైనరోడ్లు, ట్రాఫిక్ జామ్ వంటి అంశాల పై క్షుణ్ణంగా చర్చించారు. అవసరమైన చోట కల్వర్టులను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రక్కన ఉన్న నాలాలను క్లీయర్ చేసి వర్షం నీరు ఆగకుండా చూడలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. రహదారుల వెంట వీధి దీపాలను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. అధిక నిధులు అవసరమైన పనులకు ప్రణాళికలు తయారు చేసి నివేదికలు పంపాలని కలెక్టరు సంబంధిత అధికారులకు ఆదేశించారు. సంబంధిత అధికారులందరు సమన్వయంతో పనులు చేపట్టాలని కలెక్టరు తెలిపారు. జిల్లా రహదారి భద్రతా అనే అంశం పై పాఠశాల విద్యార్థులతో అవగాహాన కార్యక్రమాలను ఏర్పాటు చేసి క్యాంపెయిన్లు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ మల్కాజిగిరి ఏసిపి శ్రీనివాసరావు, ట్రాఫిక్ రాచకొండ ఇన్స్పెక్టర్ ప్రదిప్ బాలు, ఎన్ హెచ్ 44 పిడి ఎల్.ఎస్ . రావు, ఆర్ అంఢ్ బి డిఈఈ సరిత, ఏఈఈ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గన్నారు.

# భువన విజయం ఆత్మీయ సమ్మేళనం

## ఉత్సాహంగా భువన విజయం నాల్గవ వార్షికోత్సవ వేడుకలు...





శామీర్ పేట, (గరుడ వార్త) : తెలుగు భాష అభ్యున్నతి ఏ లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్న భువన విజయం నాల్గవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం మూడు చింతలపల్లి మండలం అద్రాస్ పల్లి గ్రామం నిపున్ ఫామ్ లో వార్షికోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం కన్నుల పండువగ జరిగింది. 2020 జూలై 22వ తేదీన భువన విజయం సమూహం ఏర్పాటయిందని ప్రతినిధులు నారాయణ, సరిత లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు తెలుగు భాష అభివృద్ధిలో భాగంగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టి ప్రముఖ రచయితలు అందించిన కవితలు, వ్యాసాలు, సమీక్షలు తెలుగు వెలుగులో భవిష్యత్ తరాలకు అందించాలనే తాపత్రయంతో భువనవిజయం కృషి చేస్తుందని చెప్పారు. ప్రతి ఏటా భువన విజయం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకొని తెలుగు సంగీత, సాహిత్యాలకు సంబంధించిన అంశాలపై కులంకుశంగా చర్చించి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్షికోత్సవ సందర్భంగా పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. వివిధ ప్రభు త్వశాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగు భాష అభ్యున్నతికి వివిధ హోదాల్లో ఉన్న అధికారులు సేవ చేస్తున్నారని చెప్పారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో భువన విజయం సమూహం ప్రతినిధులు బివి. నారాయణ, ఎం.సరితా రెడ్డి, సిహెచ్. సబితా రెడ్డి, జాతీయ రహదారు లు వరంగల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. విద్యాసాగర్, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎంఎస్. కుమార్, సర్వేయర్ పూసపాటి ఝాన్సీలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, విష్ణు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం..



హైదరాబాద్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు,రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్ ఆదేశాల మేరకు బుదవారం జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి మల్లం వెంకటేశంకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లం వెంకటేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు,రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి కు కృతజ్ఞతలు తెలిపారు. సమాచా ర హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందని తెలిపారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్ కు అప్పీల్ చేసుకోవాలని సూచించారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటుందన్నారు.సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాదగోని శ్రీనివాస్ గౌడ్, పందుల రాజు గౌడ్, బత్తుల మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలి : ఎమ్మెల్యే

శామీర్ పేట, (గరుడ వార్త) : యువత స్వయం ఉపాధితో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రం మూడు చింతలపల్లి లో నూతనంగా ఏర్పాటుచేసిన నీరజ్ కేఫ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ యువకులు ఉద్యోగాల కోసం ఎదురు



చూడకుండా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఉద్యోగాల కోసం ఎదురు చూచి సమయం వృధా చేసుకోకుండా స్వశక్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు నీరజ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# క్రీడల్లో యువత ప్రతిభ కనబరచాలి : ఇన్స్పెక్టర్ యాదయ్య

శామీర్ పేట, (గరుడ వార్త) : యువకులు క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని తుర్కపల్లి పరిధిలోని జినం వ్యాలీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యాదయ్య బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామీర్ పేట మండలం తుర్కపల్లి పరిధిలోని జీనం వ్యాలీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్ క్రీడలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి ఆదేశాల మేరకు తుర్కపల్లి పరిధిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో యువకులకు వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల లోపు ఆసక్తి ఉన్న వివిధ గ్రామాల యువకులు, క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. ప్రజలకు, పోలీసులకు స్నేహపూర్వకంగా, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఈ క్రీడాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని ఇన్స్పెక్టర్ యాదయ్య కోరారు.

# డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ హెడ్ గా సీనియర్ ప్రొఫెసర్ జహంగీర్..

ఓయూ : :ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం నూతన హెడ్గా ప్రొఫెసర్ వై. జహంగీర్ నియమితుల య్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొఫెసర్ జహంగీర్ గతంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినే షన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్ గా సేవలు అందించారు. ప్రస్తుతం ఓయూ గెస్ట్ హౌజ్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు



ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సీనియర్ ప్రొఫెసర్ శ్రీరాములు, మాజీ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొఫెసర్ స్మిత సంబ్రాని, ప్రొఫెసర్ సుధ, డాక్టర్ విద్యాసాగర్ రావు, డాక్టర్ సమున్నత, ప్రొఫెసర్లు వి. శేఖర్, హనుమంతరావు, కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్లు చెన్నప్ప, ప్యాట్రిక్, కవితాదేవి, రంజని, డాక్టర్ జి. శ్రీనివాసరావు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు ఎత్తున పాల్గొన్నారు.

# గణేష్ మండప నిర్వాహకులతో భారీ సదస్సు..

ముషీరాబాద్ : గణేష్ మండప నిర్వాహకు లతో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఏనుగుల వినయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముషీరాబాద్ లో జరిగిన మీడియా సమావేశం లో బీజేవైఎం నగర అధ్యక్షులు మద్దూరు శివాజీ, శక్తి సింగ్, బుర్ర రాజ్ కుమార్, మహేందర్ తో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 31న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం గణేష్




మండపాల నిర్వాహకులతో భారీ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండప నిర్వాహకులు ఈ సమావేశంలో పాల్గొని మన హిందూ ఐక్యత చాటి చెప్పేందుకు ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## అర్బన్ ఉద్యానానికి అడుగులు

పరిగి: చుట్టూరా గుట్టలు.. ఎటు చూసినా పచ్చని పైర్లు.. అనేక రకాల చెట్లు.. పక్షుల కిలకిలారావాలు.. మయూరాల విన్యాసాలు. .రయ్యిన వెళ్లే వాహనాలు ఇవన్నీ ఎక్కడ అనుకుంటున్నారా.. పరిగికి ఎనిమిది కి.మీ.దూరంలోని ప్రతిపాదిత అర్బన్ పార్కు ప్రదేశం. పార్కు ఏర్పాటుకు కసరత్తు జరగడం, కొత్త ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెండున్నరేళ్ల కిందట: పరిగి మండలం జాఫర్‌పల్లి సమీపలో రెండున్నరేళ్ల కిందట అటవీశాఖ ఆధ్వర్యంలో అర్బన్ పార్కు ఏర్పాటు చేయాలని తలంచారు. ఇటీవల జిల్లా అటవీశాఖ అధికారులు సందర్శించి పరిస్థితులను పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రిజర్వు ఫారెస్టు పరిధి మొత్తం 145 ఎకరాల విస్తీర్ణం. 50ఎకరాల్లో ఉద్యానం ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికను పంపారు. ఇందుకోసం రూ.2కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది.

సౌకర్యాలు ఇలా: ప్రతిపాదిత ప్రాంతంలో యోగా చేసేందుకు షెడ్డు, సెక్యూరిటీ గది, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక బల్లలు, నడకదారి, అడవి అందాలను తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. నిధుల సమీకరణకు అన్వేషణ ప్రారంభమైంది. పార్క్ ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నామని జిల్లా అటవీ అధికారి



జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఈ మార్గం ప్రధానం: పరిగి నుంచి షాద్‌నగర్, శంషాబాద్, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాలన్నా ఈ దారే ప్రధానం. కర్ణాటకకు చెందిన అనేక వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. ప్రతిపాదిత ప్రాంతం నుంచి షాద్‌నగర్ పట్టణానికి 25కి.మీ. దూరం. పార్కు ఏర్పాటుతో పరిగి అభివృద్ధిలో ఇది మైలురాయిగా నిలుస్తుంది.

హోదా పెరిగినా..: పరిగి జనాభా 30వేలు. 6,349మంది వరకు ఉద్యోగులున్నారు.పార్కులు లేకపోవడంతో ఆహ్లాదంగా గడపలేకపోతున్నారు. ఐరన్ పరిశ్రమల ఏర్పాటుతో వాతావరణ కాలుష్యం కూడా పెరిగింది. ఇటువంటి పరిస్థితిలో పార్క్ ఏర్పాటు అత్యవసమని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో శంకుస్థాపన–రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అర్బన్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం పక్షం రోజుల్లోనే పనులకు శంకుస్థాపన చేస్తాం. అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. నిధుల సమీకరణకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటాం.

## అడ్డగోలుగా రీల్స్ చేస్తే అరదండాలే

హైదరాబాద్: ప్రజలకు ఎంత ఇబ్బంది కలిగినా.. అడ్డగోలుగా రీల్స్ చేసేస్తాం.. ఒక్కరోజులో సెలబ్రిటీ అయిపోతామంటే ఇక నుంచి కుదరదు. రీల్స్ చేసేటప్పుడు హద్దు దాటి ప్రవర్తించినా.. ప్రజలకు ఇబ్బంది కలిగినా కటకటాలు లెక్కపెట్టాల్సిందే. సామాజిక మాధ్యమాల్లో ఫాలోవర్లను పెంచుకోవడానికి.. సెలెబ్రిటీలుగా మారడానికి జన సమ్మర్థ ప్రాంతాల్లో అసౌకర్యం కలిగేలా వీడియోలు చిత్రీకరిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలకు దిగుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమ ఖాతాలు తనిఖీ చేసి పాతవాటిపైనా కేసులు పెడుతున్నారు. తాజాగా నడిరోడ్డుపై నోట్లు వెదజల్లుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసిన యువకుడిపై కూకట్‌పల్లి, సనత్‌నగర్, కేపీహెచ్‌బీ ఠాణాల్లో కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.


బైక్‌పై స్టంట్లు.. డ్యాన్సులు.. ప్రముఖుల మాదిరి తాము కూడా సెలబ్రిటీలుగా మారిపోవాలని లేదా ఫాలోవర్లను పెంచుకోవాలనే ఆరాటంతో కొందరు యువత తప్పుదోవ పడుతున్నారు. ఇంకొందరు లైకులు, ఫాలోవర్లు పెంచుకోవడానికి అడ్డగోలు రీల్స్ చేస్తున్నారు. తమ ప్రత్యేకత చాటుకోవాలనే భావనతో రద్దీ రోడ్లపై బైకుపై స్టంట్లు వేయడం, డ్యాన్సులు, ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రాంక్‌లు, వాహనాల్లో ప్రయాణిస్తూ కరెన్సీ గాల్లోకి ఎగరేస్తూ వీడియోలు చిత్రీకరిస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు: కె.శ్రీనివాసరావు, కూకట్‌పల్లి ఏసీపీ.. సామాజిక మాధ్యమాల్లో రీల్స్/ వీడియోల కోసం ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే చట్టప్రకారం చర్యలుంటాయి. బైకుతో స్టంట్లు చేయడం, నోట్లు వెదజల్లడం, అభ్యంతరంగా ఉండడం తదితర వీడియోలు చిత్రీకరిస్తే బాధ్యులను గుర్తించి కేసులు నమోదు చేస్తాం.

తల్లిదండ్రులూ గమనించాల్సిందే..

పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి కంటెంట్ చూస్తున్నారో కచ్చితంగా గమనించాలి.పిల్లలకు ఫోన్ ఇచ్చాక దాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో పర్యవేక్షించాలి. సామాజిక మాధ్యమ ఖాతా ప్రొఫైళ్లను తనిఖీ చేస్తుండాలి. 15– 25 ఏళ్ల యువత ఎక్కువగా అభ్యంతరకరంగా వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. వీరిపై ఎక్కువ దృష్టి సారించాలి.కేసులు నమోదైతే ఇబ్బందులుఉంటాయని హెచ్చరించాలి.

## సారూ.. చెరువు కనిపించట్లేదు.. వెతికిపెట్టండి



మహేశ్వరం: తుమ్మల చెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో 8 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు కనిపించట్లేదని అందులో పేర్కొన్నారు. కబ్జా చేసి వెంచర్లు వేశారని ఆరోపించారు. దీంతో పంటలు మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చెరువు ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామని గ్రామస్థులు ఆరోపించారు.మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేత

రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేతలను చేపట్టారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది కూల్చివేసింది. పోలీసు బందోబస్తు మధ్య ఎకరా భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించారు.

## పీఎం మాన్‌ధన్ యోజనకు ఆదరణ కరవు

కరీంనగర్ : జిల్లాలో ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. అన్నదాతలకు వృద్ధాప్యంలో ఆసరాగా.. సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2018లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో దాదాపు 60 వేల మంది రైతులు అర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. కానీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వెయ్యి మంది మాత్రమే ఇందులో చేరారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**వయసు బట్టి ప్రీమియం డబ్బులు**

పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం సైతం తన వంతుగా బీమా కంపెనీకి డబ్బులు కడుతుంది. 18 ఏళ్ల రైతు తన వాటాగా రూ.55 చెల్లిస్తే కేంద్రం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తోంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. ఇలా 40 ఏళ్ల వారికి రూ.200 ప్రీమియం ఉంటుంది. ఇలా ప్రతి నెలా లేదా మూణ్నాలుగు, ఆరు మాసాలకోసారి సైతం నెలవారీ కిస్తులు చెల్లించే వెసులుబాటు కల్పించారు. అనంతరం 60 ఏళ్లు పైబడిన రైతులందరికీ నెలకు రూ.3 వేల పింఛను అందజేయనున్నారు. లేదా ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే.. రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకే సారి అందజేస్తారు. పథకంలో చేరిన రైతు మరణిస్తే జీవిత భాగస్వామి కొనసాగించవచ్చు.

**నమోదు ప్రక్రియ**

ప్రధాన్‌మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన(పీఎంకేఎంవై)లో చేరడానికి రైతులు కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)కు వెళ్లాలి. ఆధార్, ఫొటో, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నంబరు తదితర వివరాలతో పీఎంకేఎంవై పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. సమాచారం అందిన తర్వాత నిర్వాహకులు ప్రత్యేక పింఛను ఖాతా తెరచి కార్డును అందజేస్తారు. ఈ దరఖాస్తు రుసుం రూ.30 కూడా ఆన్‌లైన్ సేవా కేంద్రం నిర్వాహకులకు కేంద్ర సర్కారే చెల్లిస్తుంది.

అర్హులు–అనర్హులు

18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాలలోపు వయసు వారందరూ అర్హులు.

పీఎం కిసాన్ డబ్బులు పడే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజినీర్లు, ఇతరత్రా వృత్తినిపుణులు ఈ పథకానికి అనర్హులు.

ఆదాయ పన్ను చెల్లించే వారు, నిర్దేశితం కన్నా ఎక్కువ రాబడి



పొందుతున్న వారు, ఇతరత్రా ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందుతున్న వారు అనర్హులు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే కొనసాగింపు

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు తన వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి, కరీంనగర్

## 47 ప్రాజెక్టులు.. రూ.934.35 కోట్లు



కరీంనగర్ : దేశవ్యాప్తంగా వంద నగరాలను అత్యాధునికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కరీంనగర్ స్మార్ట్‌సిటీ మిషన్ పనులు తుది దశలో నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ 30తో గడువు ముగియగా.. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు మరోసారి గడువు పెంచింది. ప్రారంభించిన పనులు, మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేసుకునే వీలు కలిగింది. రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, అంబేడ్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, వీధి దీపాలు, కూడళ్లు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, స్మార్ట్ క్లాసులు, కమాండ్ కంట్రోల్, డిజిటల్ తెరలు, ఉచిత వైఫై తదితర పనులు అందుబాటులోకి వచ్చాయి. మిగతా ప్రాజెక్టులు కొనసాగుతుండగా.. ఎప్పటిలోగా ఇవి పూర్తవుతాయనే విషయాన్ని మాత్రం అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు.

**చేసిన పనులు 25.. చేయాల్సినవి 20**

కరీంనగర్ స్మార్ట్‌సిటీ పరిధిలో అయిదేళ్లలో నిర్దేశించిన పనులన్నీ పూర్తి కావాల్సి ఉంటుంది. మొత్తం 47 ప్రాజెక్టులను ఎంపిక చేసుకోగా రూ.934.35 కోట్లు కేటాయించారు. ఇందులో 25 ప్రాజెక్టులను రూ.647.66 కోట్లతో పూర్తి చేశారు. మిగతా 20 ప్రాజెక్టులను రూ.259.69 కోట్లతో చేపడుతున్నారు. రూ.27 కోట్లలో మిగతా రెండు ప్రాజెక్టుల్లో భాగంగా మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు టెండర్ పిలవాల్సి ఉంది. బాలసదనం భవన నిర్మాణానికి రీ టెండర్ నిర్వహించాల్సి ఉంది. పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

**తప్పని అవస్థలు** వరద కాలువ నిర్మాణ సమయంలో పనులు కొన్ని చోట్ల వదిలేశారు. శ్రీనగర్‌కాలనీ నుంచి గోదాంగడ్డ ఎస్‌బీహెచ్ ఫంక్షన్‌హాల్ వరకు వరదకాలువ నిర్మించాల్సి ఉండగా 400 మీటర్లు ఆపేశారు. పది మీటర్ల వెడల్పు, ఎనిమిది మీటర్ల లోతులో ఉండటంతో నిలిపి వేసిన చోట నుంచి వరదనీరు వెనక్కి మళ్లీ ఇళ్లలోకి వస్తోంది. కట్టరాంపూర్‌లో డ్యాంకు వెళ్లే దారిలో రెండేళ్ల క్రితం డ్రైనేజీ కోసం తవ్వి వదిలేశారు. బెడ్, సలాక అల్లీ వదిలేయడంతో నీరంతా ఒక ఇంటి దగ్గర నిలిచి ప్రమాదకరంగా తయారైంది.

గణేశ్‌నగర్ బైపాసు రోడ్డులో మాజీ ఎమ్మెల్సీ ఇంటికి ఎదురుగా వరద కాలువ ఆపేశారు. కొంతదూరం పనులు చేయకపోవడంతో పాత గోడ కూలుతోంది.కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ పనులు మొదటి దశలో ఉన్నాయి. కందకం తవ్వి వదిలేశారు. పలుచోట్ల కూడళ్ల నిర్మాణం పూర్తిగా నిలిపి వేశారు.టవర్ సర్కిల్‌లో ఆధునికీకరణ పనులు కొనసా..గుతున్నాయి. ఇంతకంటే అధ్వానమైన పనులు ఎక్కడా జరగలేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. లైటింగ్స్ కోసం తవ్వుతున్నారు.. పూడ్చుతున్నారు.నడకదారి కోసం వేసిన టైల్స్, రెయిలింగ్ ఊడిపోతున్నా కనీసం పట్టింపు లేదు. వీటి నిర్వహణ ఎవరు చూడాలనే విషయాన్ని గుర్తించడం లేదు.స్మార్ట్ వీధి దీపాలు బిగించిన వాటిని వేయకపోవడంతో పలు చోట్ల అంధకారం ఉంటుంది. ఉస్మాన్‌పుర, అహ్మద్‌పుర, అశోక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఆగిపోయాయి.

## రక్షణ మాటల్లో.. ప్రాణాలు గాలిలో



హైదరాబాద్ : పరిశ్రమల యాజమాన్యాలు, అధికారుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటోంది. అనుమతుల్లేని, ప్రమాణాలు పాటించని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో వలస కార్మికులు మరణిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే కొన్ని యాజమాన్యాలు అవి బయటకు పొక్కకుండా రాజీ కుదురుస్తున్నాయి.

ఉదంతాలు...2024 జూన్ 28న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని సౌత్‌గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన కంప్రెషర్ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి.2022 జులైలో జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వశిష్ట లైఫ్‌సైన్సెస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ పేలింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో సురేశ్ మృతి చెందాడు. 2022 ఆగస్టులో జీడిమెట్ల పరిధిలోని ఫార్మా కంపెనీలో రసాయన ప్రక్రియ సక్రమంగా లేకపోవడంతో మంటలంటుకున్నాయి. ఏడుగురు గాయపడ్డారు.ఏడాది క్రితం జీడిమెట్లలోని పారిశ్రామికవాడలోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఉద్యోగి మృతి చెందాడు.

నిఘా కొరవడటంతో... డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తనిఖీలు చేయకపోవడం, పీసీబీ అధికారులు కేవలం సీఎఫ్ఈ, సీఎఫ్‌వో అనుమతుల వరకే పరిమితం కావడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

మొత్తం పెట్టుబడిలో 2 శాతం 'పబ్లిక్ లయబులిటీ ఇన్సూరెన్స్' చేయించాలి. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టరేట్‌కు సమర్పించాలి.

2కేఎల్, 3కేఎల్‌కు బదులుగా 500ఎంఎల్ సామర్థ్యం ఉన్న రియాక్టర్లను, తక్కువ ఖర్చులో వస్తాయని సెకండ్ హ్యాండ్, నాసిరకం రియాక్టర్లను వినియోగిస్తున్నారు. అవి పేలిపోతున్నాయి. అక్కడే ఉన్న కార్మికులకు తీవ్రగాయాలై మరణిస్తున్నారు.

రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమల్లో ఈహెచ్‌ఎస్ (ఎన్విరాన్‌మెంట్ హెల్త్ సేఫ్టీ) డివిజన్ ఏర్పాటు చేయాలి. మాస్కులు, గాగుల్స్, గ్లౌజులు, బూట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ సేఫ్టీ అనుమతులే తీసుకోరు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు వెళ్లి ప్లాన్ అప్రూవల్ తీసుకెళ్లి సేఫ్టీ అనుమతులు తీసుకోవాలి. నిబంధనల ప్రకారం పరిశ్రమల్లో 'హజార్డస్ వేస్ట్ ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్, హ్యాండ్లింగ్, స్టోరేజ్' స్టడీ తప్పనిసరిగా నిర్వహించాలి. రసాయనాల నిల్వలో భద్రతా ప్రమాణాలుపాటిస్తున్నారో లేదో పరిశీలించాలి.

## కాబోయే అమ్మకు ఆపద

సంగారెడ్డి : కాబోయే అమ్మల్లో కొందరు పేదరికం కారణంగా సరైన పోషకాహారం తీసుకోకపోవడం, ఆరోగ్య సమస్యలు తదితర కారణాలతో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటున్నారు. వీరి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రాణాలకే ముప్పు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న వారిని గుర్తించి వైద్య, ఆరోగ్య, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకుంటోంది.

**ఏం చేస్తున్నారంటే..**

గర్భిణులకు నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తిస్తున్నారు. వీరిలో అత్యంతం ప్రమాదకరంగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోనూ గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గర్భస్థ శిశువు స్థితిగతులను తెలుసుకునే పరీక్షలు సమయానికి చేయించుకోవాలని తెలియజేస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాల్షియం, ఐరన్ మాత్రలు



పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గర్భిణుల గృహ సందర్శనలు చేసి ఆరోగ్యం విషయంలో ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5

అంగన్‌వాడీ కేంద్రాలు: 1,504

నమోదైన గర్భిణులు(ఏప్రిల్ నుంచి ఆగస్టు 21వరకు): 12,158

వీరిలో హైరిస్క్ గర్భిణులు: 3,508

**ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం**

గర్భిణులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి వారి ఆరోగ్యం మెరుగయ్యేలా ప్రాధాన్యం ఇస్తున్నాం. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సమన్వయంతో గర్భిణులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాట్లు చేశాం.

డా.గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి.

**గృహ సందర్శనలతో అప్రమత్తం చేస్తున్నాం**

పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుంది. ఇదే విషయాన్ని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గృహ సందర్శన సమయంలో కుంటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఒక పూట సంపూర్ణ భోజనంతో పాటు ఇంట్లోనూ పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరిస్తున్నారు.

లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి.

## ఎన్నికలొస్తున్నాయ్

సిద్దిపేట: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆసక్తి ఉన్నవారు యువతను ఆకట్టుకునేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు షురూ చేశారు. గత ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీల పాలకమండలి పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఓటరు జాబితా పూర్తయితే పోలింగ్ తేదీలను విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి ఇటీవల ఎంపీడీఓలు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తయింది. ప్రత్యేక బుక్‌లెట్స్ అందుబాటులోకి తెచ్చారు. సెప్టెంబరు 6న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ**

ఏ గ్రామంలో ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కేటాయిస్తారనే దానిపై ఇప్పటినుంచే అందరూ ఉత్కంఠగా చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? కొత్తగా నిర్ణయం తీసుకుంటారా.. అనేది తేలాల్సి ఉంది. స్థానాలను మహిళలకు కేటాయిస్తే పురుషులకు అవకాశం రానిచోట భార్య, ఇతర మహిళ కుటుంబ సభ్యులను ఎన్నికల బరిలోకి దించేందుకూ నాయకులు సిద్ధమవుతున్నారు. ఇటీవల కొత్తగా 15 పంచాయతీలను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేశారు. వాటికి ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనే విషయం అధికారులు నిర్ణయించాల్సి ఉంది.

**బల్దియాలో కలుపుతారా?**

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా తొగుట, కొండపాక మండలాల్లో ముంపునకు గురైన దాదాపు 8 గ్రామపంచాయతీలను ప్రస్తుతం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించారు. ఆ గ్రామాల పేరుతోనే పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. వాటిని అలాగే కొనసాగిస్తారా లేక బల్దియాలో విలీనం చేస్తారా? అనేది తేల్చలేదు. గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని కోరుతూ ముంపు గ్రామాల వారు ఆర్డీఓకు, ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీల ఎన్నికలు పార్టీల రహితమైనా వెనుక ఉండి నడిపించేదంతా వారే కనుక పల్లెల్లో పట్టు సాధించేందుకు తీవ్రస్థాయిలో పోటీ పడతారు. అందుకోసం అన్ని పార్టీల ప్రధాన నాయకులు రాజకీయ సందడికి తెరలేపుతారు.

సిద్ధం చేస్తున్నాం: దేవకీదేవి, డీపీఓ

పంచాయతీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నాం. ముంపు గ్రామాల విలీన ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.


| | |
| --- | --- |
| మండలాలు | 26 |
| గ్రామ పంచాయతీలు | 499 |
| కొత్త పంచాయతీలు కలిస్తే మొత్తం | 514 |
| పాతవి వార్డులు | 4,470 |
| కొత్త వార్డులు కలిస్తే మొత్తం | 4,566 |
| 2011 గణాంకాల ప్రకారం.. మొత్తం జనాభా | 10,12,066 |
| గ్రామీణ జనాభా | 7,95,690 |

# బకాయిలు చెల్లిస్తేనే గృహజ్యోతి వర్తింపు

ధర్మపురి : ఇలా సాంకేతిక కారణాలతో జీరోబిల్లు రాని వారు, విద్యుత్తు ఛార్జీలు బకాయిలు పడ్డవారు బిల్లులు చెల్లించాల్సి ఒదేనని ఆ శాఖాధికారులు చెప్తున్నారు. ఆ బిల్లులు కడితేనే ప్రస్తుతం గృహజ్యోతి పథకం వర్తించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. పలు కారణాలతో గృహజ్యోతి వర్తించకపోతే విద్యుత్తు బిల్లులను రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో జిల్లాలో వేలాది మంది బిల్లులు కట్టకుండా ఉన్నారు. అయితే విద్యుత్తు సిబ్బంది బిల్లులు చెల్లించాల్సి ఒదేనని చెప్పడంతో వినియోగదారులు వాపోతున్నారు. రూ.నాలుగు నుంచి రూ.అయిదు వేల వరకు బిల్లుల బకాయిలు ఉన్నాయి.

**సరి చేసుకునే అవకాశం**

తెల్లరేషన్ కార్డు ఉండి గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందలేని వినియోగదారులు.. వివరాలను సరి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మీటర్‌కు సంబంధించి యూఎస్‌సీ నెంబర్ తప్పుగా నమోదైనా, ప్రజాపాలన దరఖాస్తుకు సంబంధించి ఆన్‌లైన్‌లో నాట్ అప్లైడ్ అని ఉన్నా, అద్దె ఉన్నవారు వేరే ఇంటికి మారిన వారు సరి చేసుకోవచ్చు. రేషన్ లేదా ఆధార్, ఆధార్ లింకు ఫోన్ నెంబర్, విద్యుత్తు మీటర్‌కు సంబంధించిన వివరాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి సరి చేసుకోవచ్చు.నేరెల్లకు చెందిన పాదం మీనయ్య తెల్లరేషన్ కార్డు ఉ



ండటంతో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నాడు. సాంకేతిక కారణాల వల్ల జీరోబిల్లు రాని వారికి ప్రభుత్వం బిల్లు రద్దు చేస్తామని చెప్పింది. దీంతో మీనయ్య మిన్నకుండటంతో ఆరు నెలల బిల్లు రూ.1300 వచ్చింది. ప్రస్తుతం బకాయి బిల్లు చెల్లిస్తేనే గృహజ్యోతి వర్తిస్తుందని విద్యుత్తు సిబ్బంది చెప్పడంతో మీనయ్య అవాకయ్యాడు.

బిల్లులు చెల్లించాలి: మనోజ్, విద్యుత్తు అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి, జగిత్యాల రూరల్ గృహజ్యోతి వర్తించినప్పటి నుంచే జీరో బిల్లు ఉంటోంది. సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందని వారు వర్తించే వరకు వచ్చిన బిల్లు కట్టాల్సిందే. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు గృహజ్యోతిలో తప్పులు దొర్లినట్లయితే ప్రభుత్వం సవరించుకునే అవకాశం కల్పించింది.

# డిజిటల్ మాయ

రంగారెడ్డి : సర్కారు భూములను పరిరక్షించేందుకు అక్రమార్కులు హద్దు మీరకుండా వాటిని కాపాడేందుకు భూములు.. స్థలాలకు గూగుల్ మ్యాపింగ్ చేస్తాం... డిజిటల్ సర్వేలు నిర్వహిస్తామంటూ రెవెన్యూ అధికారులు ఘనంగా ప్రకటించినా డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాప్‌లపై ఉదాసీనంగా ఉంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 42 వేల ఎకరాల ప్రభుత్వ భూములకు సరిహద్దుల్లేవు. హైదరాబాద్‌కు సమీపంలో 300కుపైగా గ్రామాలు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దులో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రైవేటు పట్టా, ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములున్నాయి. ప్రైవేటు పట్టాభూముల పక్కనే ఈ భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుని బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. ధరణిలో ప్రభుత్వ భూము



లుగా ఉన్నా వాటికి సరిహద్దులు నిర్మించాలంటే సర్వే నిర్వహించాలి. అక్రమార్కులు ప్రహరీలు, ఇనుపకంచెలు నిర్మించారు.

తూతూమంత్రంగా సర్వేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను డిజిటల్ సర్వే నిర్వహించాలంటూ కొద్దిరోజుల క్రితం నిర్ణయించారు. డిజిటల్ సర్వే నిర్వహించేందుకు అవసరమైన సర్వేయర్లు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని చాలా మండల కార్యాలయాల్లో అందుబాటులో లేరు. డిజిటల్ సర్వేకు హడావుడిగా కొనుగోలు చేసిన పరికరాలు ఆర్డీవో కార్యాలయాల్లో మూలనపడున్నాయి. ప్రభుత్వ భూముల సర్వేపై ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదు. కానీ ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో డిజిటల్ సర్వేలు చేయిస్తున్నారు.

# చిన్న షావల్స్ వైపే సింగరేణి మొగ్గు

కొత్తగూడెం : సింగరేణి ఉపరితల గనుల్లో ఓబీ(మట్టి) వెలికితీయడం, బొగ్గును ఉత్పత్తి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న షావల్స్‌పై యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టింది. సంస్థలోని 22 ఉపరితల గనుల్లో 11, 12క్యూబిక్ మీటర్ల భారీ షావల్స్ కంటే.. 5క్యూబిక్ మీటర్లున్న షావల్స్‌తోనే చురుగ్గా పనులు జరుగుతుండడంతో భవిష్యత్తులో వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆపరేషన్, ఈఅండ్‌ఎం విభాగం భావిస్తోంది. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన సమీక్ష సమావేశం లో షావల్స్ పనితీరుపై ఏరియా జీఎంలు, ప్రాజెక్టు అధికారులు, ఇంజినీర్ల అభిప్రాయాలను తీసుకున్న ఉన్నతాధికారులు.. వాటి పనితీరు పై సుదీర్ఘంగా చర్చించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పని..రూ. 14కోట్ల వ్యయంతో కొనుగోలు చేస్తున్న షావల్స్‌కు సమానంగా రూ. 6కోట్ల వ్యయాన్ని వెచ్చించిన చిన్న షావల్స్ పనిచేస్తున్నాయి. దీనికితోడు సంస్థలోని ప్రైవేటుగా ఓబీ వెలికితీసే గుత్తేదార్లు వినియోగిస్తున్న షావల్స్ అన్ని చిన్నవి కావడం కూడా ఓ కారణమే. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పని జరిగేలా చిన్న షావల్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారు. సంస్థలోని ఉపరితల గనుల్లో ప్రస్తుతం రెండు అతి భారీ యంత్రాలు దీనిలో ఓసీపీ-1 డ్రాగ్‌లైన్‌ను ఇప్పటికే యాజమాన్యం అమ్మకానికి పెట్టింది. అలాగే ఆర్జీ-2 డివిజన్ ఓసీపీ-3 ప్రాజెక్టులోని డ్రాగ్‌లైన్‌కు దాదాపు 6 నుంచి 8 నెలలకు సరిపడా పని స్థలాలు మాత్రమే ఉన్నాయి.

# రక్షిత తాగునీరు అందేనా?



గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు రానున్న తొమ్మిది నెలల్లో రక్షిత మంచినీరు సరఫరా కానుంది. ఇందు కోసం గోదావరి నీటిని శుద్ధి చేసే ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులతో ఆర్జీ-1, 2, 3 ప్రాంతంలోని 13 వేల కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. మరో తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గోదావరిఖనిలోని గంగానగర్ వద్ద నిర్మిస్తున్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ మే 2025 నాటికి పూర్తి కానుందని అధికారులు వెల్లడించారు.

ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీతో ఇబ్బందులే

ప్రస్తుతం సింగరేణి గోదావరిలో వేసిన ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ ద్వారా కార్మికుల కుటుంబాలకు తాగునీరు అందిస్తుంది. ఇసుక రేణువుల ద్వారా నీరు శుద్ధి అయి ఇన్‌ఫిల్ట్రేషన్ బావులోకి చేరుతాయి. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఇన్‌టేక్ వెల్‌లోకి చేరుకుంటాయి. మోటార్ల ద్వారా కార్మిక కుటుంబాలకు సరఫరా అవుతాయి. అయితే ఇన్‌ఫిల్ట్రేషన్ విధానం ద్వారా నదీ ప్రవాహ సమయంలో ఇబ్బంది లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిలో వెనక జలాల వల్ల ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీలు మునిగిపోయి బావుల్లోకి మురికినీరు చేరుతుంది. వర్షాకాలంలో అవి పూర్తిగా మునిగి పోవడంతో బావుల పైకప్పులు లేచి అందులోకి నది నీరు చేరుతుంది. దీంతో నీరు మురికిగా రావడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. వీటిని నాగ్‌పూర్‌కు చెందిన ఓ సంస్థతో యజమాన్యం మరమ్మతులు చేయించింది. నీటిలో పనిచేసే అనుభవం ఉన్న వారిని నదిలో దించి పనులు చేయించినా ఫలితం లేకుండా పోయింది.

**రోజుకు 35 మిలియన్ లీటర్ల నీరు శుద్ధి**

ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ విధానంతో కార్మిక కుటుంబాలకు సురక్షితమైన తాగునీరు అందకపోవడంతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానం అమలు చేయాలని సింగరేణి నిర్ణయించింది. మిషన్ భగీరథ తరహాలోనే తాగునీరు శుద్ధి చేయాలని ప్రణాళికలు వేసింది. దీని కోసం రూ.20 కోట్లు కేటాయించింది. గోదావరి నీటిని మోటార్ల ద్వారా గ్రావిటీ ఫిల్టర్ బెడ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేయనున్నారు. దీని వల్ల నీటిలో ఎలాంటి మలినాలు, మురుగు నీరు చేరే అవకాశం ఉండదు. రోజుకు 35 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో ఈ ఫిల్టర్ బెడ్‌లు నిర్మిస్తున్నారు. రామగుండం-1 ప్రాంతానికి 20 మిలియన్ లీటర్లు, ఆర్జీ-2, 3 డివిజన్‌లకు 15 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండం రీజియన్‌లో 13 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వారి కుటుంబాలు మరో 40 వేల మంది ఉంటారు. వీరికి రోజునకు 35 మిలియన్ లీటర్ల నీరు అవసరం పడుతుంది. దానికి అనుగుణంగానే సింగరేణి ఏర్పాట్లు చేస్తుంది.

**మే నాటికి పనులు పూర్తి** సురక్షితమైన తాగునీరు అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. 2025 మే నాటికి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తాం. దీనివల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్య రాదు. మురికినీరు వచ్చే అవకాశం ఉండదు. నిర్మాణం పనులు వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం

# ఆపద వేళ.. మేమున్నామని భరోసా



కరీంనగర్ : ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం రావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. ప్రయాణికులకు ఆపత్కాలంలో 'మేమున్నాం అంటూ' భరోసానిస్తున్నారు సంస్థ సిబ్బంది. ఒక వైపు విధి నిర్వహణ బాధ్యత చూస్తూనే.. మరో వైపు సేవా కార్యక్రమాల్లో తరిస్తున్నారు. గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతుంటే వైద్య సిబ్బంది అవతారమెత్తి అండగా నిలుస్తున్నారు. ఎవరైనా వస్తువు మరిచిపోతే మంచి మనసుతో వారి చెంతకు చేరుస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది ఔదార్యంపై కథనం.

**నిత్యం లక్ష మంది రాకపోకలు..**

కరీంనగర్ బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం లక్ష మందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ ఉద్యోగులు, పొరుగుసేవల సిబ్బంది విధులు నిర్వర్తిస్తూనే ఆపద వేళ ప్రయాణికులకు అండగా ఉంటున్నారు. ప్రయాణికులు అనారోగ్యంగా ఉన్నట్లు తెలిస్తే ఆసుపత్రికి పంపిస్తున్నారు. గర్భిణులు నొప్పులతో బాధపడటంలాంటి సందర్భాల్లో 108కు సమాచారం ఇస్తున్నారు. ప్రయాణికులు పోగొట్టుకుంటున్న విలువైన వస్తువులు తిరిగి అప్పగిస్తున్నారు.వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటే మేలు

రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద ప్రయాణ ప్రాంగణం ఇది. ఇక్కడ రోజూ వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత మహిళల సంఖ్య మరింత పెరిగింది. రోజూ ఎవరో ఒకరు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆలోచించి.. ఇక్కడ ఒక వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంటే ప్రయాణికులు మేలు చేసినవారవుతారు.

**కొన్ని ఘటనలు ఇలా..**

మే 6న ఓ వృద్ధురాలు బస్టాండ్‌కు వచ్చి.. అస్వస్థతకు గురికాగా స్పందించిన సిబ్బంది 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

జూన్ 16న ఒడిశాకు చెందిన గర్భిణి కుంట (చత్తీస్‌గఢ్) వెళ్లడానికి కరీంనగర్ బస్టాండ్‌కు రాగా, ఆమెకు నొప్పులు రావడంతో.. ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, స్రవంతి, లావణ్య, భవానీ, రేణుకలు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రసవం చేశారు. ఆమె పండటి పాపకు జన్మనిచ్చింది. అనంతరం 108 వాహనంలో తల్లి, శిశువును ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు సంస్థ ఎండీ సజ్జనార్, కలెక్టర్, ఇతర అధికారులు ప్రశంసించారు. జూన్ 20 మంచిర్యాల నుంచి హైదరాబాద్ వెళ్లే ఓ ప్రయాణికుడు రూ.3 లక్షల బ్యాగ్‌ను బస్సులో ఉంచి.. పెద్దపల్లిలో దిగగా.. అతడు వచ్చే లోపు బస్సు వెళ్లిపోయింది. ఆయన వెంటనే కరీంనగర్ బస్టాండ్ భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏటీఎం రజనీకృష్ణ, ఎస్‌ఎం అంజయ్య బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎం సుచరిత ఆధ్వర్యంలో ఆయనకు అందజేశారు.

ఆగస్టు 18న లక్ష్మి అనే గర్భిణి హుస్నాబాద్ నుంచి మందమర్రి వెళ్లడానికి కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చింది. ఆమెకు నొప్పులు రావడంతో ఎస్‌ఎం అంజయ్య 108కు సమాచారం అందించారు. ఆమె వెంట మంగ అనే పొరుగు సేవల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రసవమయ్యే వరకు (రాత్రి 11 గంటల) అక్కడే ఉంది.

**అధికారుల ప్రశంసలు..**

ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు అదనంగా సేవా కార్యక్రమాలు చేయడంపై ప్రయాణికులు అభినందిస్తున్నారు. మహిళకు బస్టాండ్‌లో ప్రసవం చేసిన సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 వేల నగదు పురస్కారం అందజేయగా, సంస్థ ఎండీ సజ్జనార్ హైదరాబాద్‌లో సత్కరించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టేషన్ మేనేజర్ అంజయ్య మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

# సొంత నైపుణ్యం.. వస్త్రాల్లో వైవిధ్యం



సిరిసిల్ల: ఒక ఆలోచన.. ఆ వృత్తిలో పని చేసేవారందరికీ ఉపయోగపడితే స్ఫూర్తిగా నిలుస్తుంది. బతుకమ్మ చీరల డిజైన్లపై పని చేసిన అనుభవంతో కాటన్ చీరలు నేస్తున్నారు. నెల రోజుల క్రితం సిరిసిల్లలో ఒకటి, రెండు మగ్గాలపై ప్రారంభమైన ఉత్పత్తులు, పలు రకాల డిజైన్లతో వంద మగ్గాలకు చేరుకున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నేతన్నలు తమ నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. సొంత ఉత్పత్తులతో మార్కెట్‌ను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని 30 వేల మరమగ్గాల్లో 14 వేల మగ్గాలకు డాబీ, జకార్డు పరికరాలు ఉన్నాయి. వీటికి కొద్దిపాటి మార్పులు చేసుకుంటే చాలు. పాలిస్టర్ నుంచి పట్టువస్త్రాల వరకు చాలా రకాలు ఉత్పత్తి చేయొచ్చు. సిరిసిల్లలో అలాంటి నైపుణ్యాలున్న నేతన్నలకు కొదువలేదు. ఏడాది క్రితం పాలిస్టర్ నూలుతో బతుకమ్మ చీరలు నేసిన మరమగ్గాలపై ప్రస్తుతం కాటన్ చీరలు నేస్తున్నారు. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. అందులోనూ వందశాతం కాటన్, సిల్కు నూలు, జరీ అంచులో డిజైన్లు ఉన్నవి మగువలను ఇట్టే ఆకర్షిస్తుంటాయి.

గద్వాల, పోచంపల్లి, ధర్మవరం వంటి ప్రాంతాలు కాటన్ చీరల ఉత్పత్తులకు ప్రసిద్ధి. సిరిసిల్ల, తంగళ్లపల్లిలోని నేతన్నలు హైదరాబాద్, కర్ణాటక, చెన్నై, చీరాల, చిలకలూరిపేటలోని వస్త్ర వ్యాపార సంస్థల నుంచి ప్రత్యేకంగా చీరల ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. సుమారు 50 నుంచి 100 మగ్గాలపై వివిధ రకాల డిజైన్లతో వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. డిజైన్ల కోసం డాబీ, జకార్డు అమర్చిన మరమగ్గాలకు కొద్దిపాటి మార్పులు చేసుకుంటున్నారు.

ఎప్పుడూ ఒకే రకమైన వస్త్రోత్పత్తులతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గి పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పత్తిలో వైవిధ్యాన్ని చూపాలి. జిల్లా పరిశ్రమలో తొలుత బతుకమ్మ చీరలకు జరీ అంచులు, డిజైన్లు వచ్చినపుడు ఆసాములు, కార్మికులు ఉత్పత్తిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇది పూర్తిగా కాటన్, సిల్కు నూలు కాబట్టి కార్మికుడు రెండు మగ్గాలపై మించి పని చేసే పరిస్థితి ఉండదు.

కార్మికుడు ఒక షిఫ్టులో మూడు చీరలు ఉత్పత్తి చేయగలడు. ఒక చీరకు రూ.250 చెల్లించేలా ధర నిర్ణయించారు. ఇలా రెండు మగ్గాలపై ఆరు చీరలు నేయగలడు. అంటే రోజుకు సుమారు రూ.1,500 వరకు కార్మికుడు కూలీ పొందవచ్చు. బతుకమ్మ చీరలకు గరిష్ఠంగా ఆరు మగ్గాలపై పని చేయాలి. దీనికి రూ.800 వరకు గిట్టుబాటు అవుతుండేది. కేస్‌మెంట్, పాలిస్టర్ వస్త్రోత్పత్తులకు రోజుకు సగటున రూ.300 నుంచి రూ.400 కూలీ లభించడం గగనమవుతుంది.

ఉపాధికి ఢోకా లేదు - బైరి శ్రీనివాస్, వ్యాపారి

బతుకమ్మ చీరలు నేసిన మగ్గాలకే కొద్దిపాటి మార్పులు చేసుకుంటే చాలు మంచి డిజైన్లతో చీరలు నేయవచ్చు. వీటికి అవసరమైన ముడి సరకు స్థానికంగా లభ్యమవుతుంది. ఇక మార్కెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటే డిమాండ్ ఉన్న వస్త్రాలు తెలుస్తాయి. నైపుణ్యం, నాణ్యతను బట్టి ఆర్డర్లు పెరుగుతాయి. దీంతో ఉపాధి అవకాశాలు వెతుకుంటూ సిరిసిల్లకు వస్తాయి.

# గంగ ఉన్నా.. పంటలకు గగనమే!

తాండూరు : శివసాగర్ జలాశయం నుంచి ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగు నీరు అందేలా కనిపించడం లేదు. నిధులు సిద్ధంగా ఉన్నా, రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడంలేదు. దీంతో నిర్ణీత ఆయకట్టుకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం గగనంగా మారింది. ఏటా వర్షాలకు ప్రాజెక్టు నిండడం అలుగు పారడమే జరుగుతోంది. రైతులు వర్షాధార పంటలను సాగు చేయక తప్పడం లేదు.

**19ఏళ్ల కిందట పనులు ప్రారంభమై**

కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు 19 ఏళ్ల కిందట ప్రారంభమైంది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నదికి అడ్డంగా కరకట్ట నిర్మించారు. శిఖం భూమిలో నీటిని నిల్వ చేసి భూములకు వదిలేందుకు ప్రధాన తూము నిర్మించారు. అధికమైన నీరు దిగువకు వెళ్లేందుకు అలుగు నిర్మాణం ప్రమాణాల మేరకు జరగలేదు. దీంతో తూము వైపు ఒత్తిడి పెరగడంతో 2013లో వెలుపలి భాగం కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయడంతో 2014 నుంచి నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం చేసిన గుత్తేదారును బ్లాక్ లిస్టులో చేర్చారు. అనంతరం నిధులు



మంజూరు చేసి మరో గుత్తేదారుకు పనులు అప్పగించినా ఫలితం లేదు. కట్టకు ఇరువైపులా వృక్షాలు పెరిగాయి. భూసేకరణ జరిగినా..: జలాశయం నుంచి ఆయకట్టు భూములకు నీటిని వదిలేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం భూములను సేకరించింది. రైతులకు పరిహారం చెల్లించారు. కాలువల నిర్మాణానికి ఇంజినీర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటే పనులు జరగాల్సి ఉన్నా, అడుగు ముందుకు పడలేదు. భూములు ఖాళీగా ఉండడంతో పరిహారం పొందిన రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం - సుందర్, ఎస్‌ఈ. జలాశయం పనులను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం. వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. అలుగు పనులు కొంత మేర జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కాగానే కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తాం.

# ఊరికి ఉపకారులు

తాండూరు : ఎంత ఎదిగినా జన్మభూమిని మరువరు కొందరు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకో.. తాము పుట్టిపెరి గిన ఊరి బాగోగుకో.. కృషి చేస్తుంటారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసాలకు ఊతం అందిస్తున్న వారు ఉన్నారు. అలా స్వస్థలాల సేవలో తరిస్తూ.. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు...

**స్థలం విరాళం.. చదువుకు ఆధారం**

తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు చెందిన సేవ్యానాయక్ గుంట స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విరాళంగా అందించారు. 1999లో చేసిన భూదానంతో తొలిసారిగా తండాలో సర్కారు బడి ఏర్పాటైంది. గిరిజన రైతు అందించిన సహకారం విద్యార్థు ల చెంతకే బడి వచ్చేలా చేసింది. అప్పటివరకు తండాలో బడిలేక చిన్నారులు అయిదు కిలోమీటర్ల దూరంలోని జిన్‌గుర్తి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొందరు చదువులకు దూరమయ్యారు. సొంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి అప్పగించడంతో పాతిక సంవత్సరాలుగా పాఠాలు నేర్పించేందుకు వెసులుబాటు లభించింది.

**రూ. లక్ష వెచ్చించి.. గుడి నిర్మించి** స్పందించే మనసు ఉంటే గుడికైనా, బడికైనా



సహకారం అందిస్తారు. ఆ కోవలోకే చేరుతారు కరుణా కర్‌రెడ్డి. పూడూరు మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఆయన కుటుంబంతో 30 ఏళ్ల కిందట తాండూరుకు వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, పుణ్యమ్మ, భార్య సుజాత సహకారంతో కోట్‌పల్లి మండలం సుల్తాన్‌పూరులో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందు కోసం ముందుగా ఆయన రూ.లక్ష వరకు వెచ్చిం చారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సహకారంతో గతేడాది పనులు మొదలు పెట్టి ఈ ఏడాది పూర్తి చేశారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో రెండు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

**పదేళ్లుగా మాతృభూమి సేవలో..**

ఎన్నారై డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి స్వస్థలం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి. సొంతూరుతోపాటు పక్క గ్రామమైన బూచినెల్లికి సేవలందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు ల్యాప్‌టాప్‌లు, 25 కంప్యూటర్లు అందజేశారు. 18 మంది గ్రామస్థులకు కంటి శస్త్రచికిత్సలు చేయించ డంతోపాటు 370 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు పేద విద్యార్థుల పూర్తి ఫీజు చెల్లించే బాధ్యత తీసుకున్నారు. తొలి ఏడాది ఫీజు రూ.2.20 లక్షలు చెల్లించారు. ఓ బోరుబావి తవ్వించడంతోపాటు.. రెండేళ్ల కిందట గ్రామంలో రూ.18 లక్షలతో 22 సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు.

**నీటి వెత తీర్చి..**

దోమ మండలం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. బడిలో ఏర్పాటు చేసిన ట్యాంకు మరమ్మతుకు గురైంది. దీంతో తాగునీటికి చిన్నారులు, మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం కేఎస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిసింది. వెంటనే సంస్థ ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బడికి దగ్గర్లోనే గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు నుంచి పాఠశాల వరకు పైపులైన్ వేయించి ట్యాంకుకు, వంట గది వద్ద కుళాయి ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.10వేలు వెచ్చించారు. ప్రస్తుతం నిరంతరం నీటి సరఫరా కావడంతో సమస్య తీరింది. ఇంకే సమస్య ఉన్నా, సహకారం అందించేందుకు ముందుంటామని శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# డిజిటల్ రూపంలో విద్యార్థుల వివరాలు

హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థి వివరాలు డిజిటల్ రూపంలోకి మారుతున్నాయి. జిలాల్లో విద్యార్థుల సంఖ్య, అందులో ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న వారి వివరాలు.. గురుకులాలు, మైనార్టీ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో విద్యార్థుల వివరాలన్నింటినీ శాఖ అధికారులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించేందుకు ప్రభుత్వం యూడైస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఎంతమంది అన్న వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుస్తాయి. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనున్న పుస్తకాలు, ఏకరూప దుస్తులను కచ్చితంగా లెక్కగట్టేందుకు, మధ్యాహ్న భోజనం సద్వినియోగమయ్యేందుకు యూడైస్ విధానం ఉపయోగపడనుందని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

పేర్లు, వివరాలు ఒక్కసారే.. పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆయా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు నమోదుచేస్తున్నారు. అందుకు



ప్రతి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, లాగిన్‌ను జిల్లా అధికారులు కేటాయించారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్‌లో నమోదైన విద్యార్థులకు మాత్రమే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు ఇస్తున్నారు. గతంలో నగరంలోని కొన్ని పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్నా.. ఎక్కువగా ఉన్నట్టు చూపించారు. యూడైస్‌లో ఒక్కో తరగతిలో ఎంత మంది విద్యార్థులున్నారన్న అంశంపై కచ్చితమైన సమాచారం ఉండటంతో ఇకపై అలాంటి తప్పులకు అవకాశముండదు.

శాశ్వత విద్యా సంఖ్య..హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రతి ఒక్కరికీ శాశ్వత విద్యా సంఖ్యను కేటాయించారు. హైదరాబాద్ జిల్లాలో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారినా, ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరినా శాశ్వత విద్యా సంఖ్య మారదు.

# కుర్చీలు కదలనున్నాయ్

హైదరాబాద్ : జలమండలిలో ఏళ్లుగా వివిధ విభాగాల్లో తిష్ఠవేసిన పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కుర్చీలు కదలనున్నాయి. నాలుగేళ్లు, అంతకంటే ఎక్కువ సంవత్సరాలు ఒకేచోట ఉన్న చాలామందికి స్థాన చలనం కల్పించనున్నారు. చీఫ్ జనరల్ మేనేజర్ నుంచి లైన్‌మేన్ వరకు దాదాపు 3,900 మంది సేవలు అందిస్తుండగా..40 శాతం మందిని బదిలీ చేయనున్నారు. మహానగరంలో దాదాపు 1,400 చదరపు కిలోమీటర్ల పరిధిలో అవుటర్ రింగ్‌రోడ్డు వరకు జలమండలి సేవలందిస్తోంది. తాగునీటితో పాటు మురుగు నీటి నిర్వహణ జలమండలి పరిధిలో ఉంది. గచ్చిబౌలి, కోకాపేట్, నానక్‌రాంగూడ, మణికొండ వంటి ప్రాంతాల్లో భారీ ఎత్తున వాణిజ్య, వ్యాపార, నివాస సముదాయాలు వస్తున్నాయి. వీటికి కొత్త కనెక్షన్లు ఇచ్చేప్పుడు కొందరు అధికారులు అంతా తామై చక్రం తిప్పుతున్నారు. కొందరైతే మేనేజర్ల పోస్టులతో ప్రస్థానం ప్రారంభించి అదే డివిజన్‌లో జీఎంలు, డీజీఎంలుగా కూడా కొనసాగుతున్నారు. శివార్లలో కొందరు జీఎంలు, డీజీఎంలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. ఏళ్లుగా ఒకచోట పాతుకుపోవడంతో ఇలా వ్యవహరిస్తున్నా



రన్న విమర్శలున్నాయి. బదిలీలను ఎలాగైనా తప్పించుకోవడానికి ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో కొందరున్నట్లు తెలుస్తోంది.

కిందిస్థాయి సిబ్బందికి సైతం..

ఉన్నతాధికారులే కాకుండా కింది స్థాయిలో పనిచేస్తున్న లైన్‌మేన్లు, ఇతర నాలుగో తరగతి సిబ్బందిని సైతం బదిలీ చేయనున్నారు. ఆయా డివిజన్ల సీజీఎంలు ఈ నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఈ బదిలీలను కింది స్థాయి సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల ఎండీని కలిసి ఇబ్బందులను వివరించారు. ఒక్కో లైన్ పరిధిలో 40వరకు వాల్వులుంటాయి. అవెక్కడెక్కడ ఉంటాయో వారికే తెలుస్తుంది. సమయానికి నీటి సరఫరా చేయాలంటే వీళ్లే కీలకం. ఒక్కసారిగా అందరినీ బదిలీ చేస్తే సరఫరాపై ప్రభావం పడుతుందంటున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్న తర్వాతే బదిలీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# దారులు చెరువులై.. అవస్థలు చేరువై

హైదరాబాద్: నగరంలో కుండపోత వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అర్ధరాత్రి వరకు వాన కురిసింది. చాలాచోట్ల మోకాళ్ల లోతులో వరద ప్రవహించింది. నాచారంలో పోలీస్‌స్టేషన్ వెనుక ప్రహరీ కూలిపోయింది. కొత్తగూడ–హఫీజ్‌పేట మార్గంలో వరద నిలిచింది. పంజాగుట్ట కూడలిలో ఉన్న మల్టీప్లెక్స్‌లో సినిమా చూస్తున్న ప్రేక్షకులకు ఊహించని అనుభవం ఎదురైంది. వర్షం నీరు



పైనుంచి కారడంతో ఒక్కసారిగా ఏం జరుగుతుందోనని ఆందోళనకు గురయ్యారు. నిర్వాహణ తీరుపై యాజమాన్యంపై అసహనం వ్యక్తం చేశారు. వరదనీటిని తొలగించేందుకు అధికారులను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి అప్రమత్తం చేశారు. ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ పలు ప్రాంతాల్లో పర్యటించి సహాయ చర్యలను పర్యవేక్షించారు. 15 ఉపకేంద్రాల పరిధిలో నిలిచిన సరఫరా.. నగర శివారులోని మల్కారంలో 132కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో పిడుగుపాటుకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయ్యాయి. దీంతో 40 వరకు 33కేవీ ఉపకేంద్రాలకు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

# కాసుల ఎర.. మాయగాళ్ల చెర



హైదరాబాద్: జగిత్యాలకు చెందిన యువకుడు ఉపాధి కోసం నగరానికి వచ్చి ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ ఖాళీ సమయాల్లో బైక్ ట్యాక్సీ నడుపుతున్నాడు. ఇటీవల సొంతూరు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వ్యక్తి పరిచయమయ్యాడు. అతడి మాటలు నమ్మి రూ. 5వేలకు ఆశపడి బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు ఇచ్చాడు. తన ఖాతాతో ఏం చేస్తున్నారనే తెలిసేలోపే ఆ యువకుడికి టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ఫోన్ చేశారు. రూ.లక్షల్లో అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు చెప్పారు. తనకేం తెలియదని మొదట బుకాయించినా డబ్బుపై ఆశతో సహకరించినట్టు అంగీకరించాడు. ఇదే తరహాలో కరీంనగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలనుంచి ఉద్యోగావకాశాల కోసం వచ్చిన 11 మంది తమ బ్యాంకు ఖాతాలు ఏజెంట్ల చేతికిచ్చి పోలీసు రికార్డుల్లోకి చేరారు. ఈ విషయం తమ వారికి తెలిస్తే సొంతూళ్లో ముఖం చూపలేమంటూ ఓ బాధితుడు ఆవేదన వెలిబుచ్చారు.

కేసులతో ఉక్కిరిబిక్కిరి..

కమీషన్లపై ఆశతో అమాయక యువత సైబర్ ఉచ్చులో చిక్కుతున్నారు. పోలీసు కేసుల్లో ఇరుక్కొని బయటపడలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరికొందరు జైలు నుంచి బయటకొచ్చాక ఏజెంట్ల అవతారమెత్తుతున్నారు. దేశ, విదేశాల్లోని కేటుగాళ్లకు సహకరిస్తున్నారు. ఉన్నతవిద్య, ఉపాధి బాటలో వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది యువతీ, యువకులు నగర బాట పడుతున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా కుటుంబానికి సహకరించవచ్చని ఆలోచిస్తున్నారు. నిరుద్యోగుల బలహీనతను అవకాశం చేసుకున్న ఏజెంట్లు, దళారులు వీరికి వల విసురుతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడే దేశ, విదేశీ ముఠాలకు అవసరమైన బ్యాంకు ఖాతాలు, నకిలీ సంస్థల డైరెక్టర్లుగా వ్యవహరిస్తే భారీఎత్తున కమీషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు. తెరవెనుక అసలు బాగోతం తెలియని యువత మాయగాళ్ల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారు. నగరానికి చెందిన వెంకటేశ్, విజయ్(36) టెలిగ్రామ్ ద్వారా సైబర్ నేరగాళ్లకు దగ్గరయ్యారు. వారికి బ్యాంకు ఖాతాలు సమకూర్చి రూ. 3కోట్ల మేర సొత్తు కొల్లగొట్టారు. తిరుపతికి చెందిన శిరీష్‌కుమార్ చైనాలోని కేటుగాళ్లకు సహకరించి నగర యువతి నుంచి రూ. 60లక్షలు కాజేశాడు. ఈ ముగ్గురు పోలీసులకు చిక్కి అరెస్టయ్యారు. పోలీసు రికార్డుల ప్రకారం సుమారు 1000 మంది వరకూ సైబర్ ముఠాలకు తమ ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు ఇచ్చినట్టు గుర్తించామని నగరానికి చెందిన పోలీసు అధికారి తెలిపారు.

ఇదీ మాయగాళ్ల ఎత్తుగడ

సైబర్ నేరాల ముఠాలకు సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు కావాలి. తమ వ్యక్తిగత సమాచారంతో లావాదేవీలు జరిపితే పోలీసులకు చిక్కుతామనే ఉద్దేశంతో బయటివారిని పావులుగా మలుచుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. అదే మాధ్యమాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తమకు సహకరించే వారి కోసం గాలిస్తున్నారు. ముందుకొచ్చిన వారిద్వారా నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, నిరుద్యోగ యువకులు, చిరుద్యోగులు ఒక్కొక్కరికి రూ. 10–15 వేలిచ్చి బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. వాటిని దేశ,విదేశాల్లోని సైబర్ ముఠాలకు చేరవేస్తున్నారు. ఒక్కో బ్యాంకు ఖాతా ప్రారంభించినందుకు రూ. 30–50వేలు కమీషన్‌గా అందుతుంది. బ్యాంకు ఖాతా అద్దెకిచ్చినందుకు రూ.లక్ష లావాదేవీకు రూ.వెయ్యి కమీషన్‌గా ఇస్తారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు ఖాతాలు గుర్తించినా అప్పటికే నగదు మాయగాళ్ల చేతికి చేరుతుంది.

# కాలుష్యం.. ప్రాణసంకటం



తాండూరు: విద్యాసంస్థలకు సమీపంలో పరిశ్రమలు ఉండడంతో విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారుతోంది. అయిదు గ్రామాల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. సర్కారు భూములు అందుబాటులో ఉండటంతో పరిశ్రమల చెంతనే విద్యాసంస్థలను నెలకొల్పుతున్నారు. విద్యార్థులు, గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు.

విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు: తాండూరు మండలంలోని ఐనెల్లి శివారులో విద్యాసంస్థల చెంతనే పరిశ్రమలు నడుస్తున్నాయి. వాతావరణం కలుషితం అవుతుండడంతో దీర్ఘకాలంలో ఆరోగ్యాలపై ప్రభావం పడుతుందని భయాందోళన చెందుతున్నారు. ఆదర్శ పాఠశాల, కళాశాలలో 600లకుపైగా విద్యార్థులు చేరారు. వంద మంది బాలికలకు వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. చెంతనే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాల నిర్వహిస్తుండగా.. 400 మందికిపైగా విద్యార్థినులున్నారు. అవతలివైపు రూ. 18 కోట్లతో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభించారు. అందులో 600 మందికి భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సమీపంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కళాశాల ఉన్నాయి. వాటిల్లో 800కుపైగా చేరారు. ఒకేచోట పక్కపక్కనే నాలుగు విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సర్కారు లక్ష్యానికి గండి: ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు చదువులకు దూరం కారాదన్న ఉద్దేశంతో ప్రభుత్వం వసతిగృహాలు, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు, కళాశాలలను నెలకొల్పింది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు వాటిలో చేర్పిస్తున్నారు. విద్యాసంస్థల చెంతనే కాలుష్యాన్ని వెదజల్లే వ్యర్థాల పరిశ్రమలు కొనసాగుతున్నాయి. కస్తూర్బాగాంధీ పాఠశాల వెనక ఉన్న ఓ పరిశ్రమలో నెల కిందట అగ్నిప్రమాదం జరిగి మూతపడింది. హైదరాబాద్‌లో ఉంటున్న యజమాని పనులు ప్రారంభించారు. ఈ విద్యాసంస్థల పక్కనే గుజరాత్‌కు చెందిన యజమాని కర్మాగారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో పరిసరాల్లో దుర్వాసన, నీటి, గాలి కాలుష్యం ఏర్పడి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు, చర్మవ్యాధులు, జలుబు, తలనొప్పితో చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో విద్యాసంస్థల నిర్మాణానికి అధికారులు వాటిని కేటాయిస్తున్నారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమల చెంతనే విద్యాసంస్థలు నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, ఐనెల్లి, జిన్‌గుర్తి, కోటబాస్పల్లి గ్రామస్థులు సైతం కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. పంట దిగుబడులు తగ్గుతున్నాయి.

ఊపిరాడని పరిస్థితి..– విజయరత్న, ప్రత్యేకాధికారిణి, కేజీబీవీ, తాండూరు

పాఠశాల, కళాశాల పక్కనే పరిశ్రమలు కొనసాగుతున్నాయి. వాటి నుంచి దుర్వాసన వస్తోంది. సాయంత్రం వేళ ఊపిరి ఆడని పరిస్థితి నెలకొటోంది. వందల మంది విద్యార్థుల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతోంది. విద్యాసంస్థల పక్కన కాలుష్య పరిశ్రమలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

# ఖాళీ ప్లాట్లు.. ప్రజల పాట్లు

పెద్దపల్లి: రామగుండం నగరంతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల పరిధిలో ఉన్న ఖాళీ ప్లాట్లతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు నిలిచి ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి పాములు, తేళ్లు, దోమలకు ఆవాసాలుగా మారి కాలనీవాసులకు కంటిమీద కునుకును దూరం చేస్తున్నాయి. ఒకవైపు అందమైన భవనాలు నిర్మించుకుంటే పక్కన ఉండే ఖాళీ ప్లాటులో చెత్తచెదారంతో పాటు వర్షపునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షాకాలం వస్తే చాలు అపరిశుభ్రత ఏర్పడి పలు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.

అపరిశుభ్ర ప్రాంతాలు ఇవే..

రామగుండంలో ఇందిరానగర్, అయోధ్యనగర్‌కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, ప్రగతినగర్, మాతంగికాలనీ, జ్యోతినగర్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు చెత్తచెదారం, అపరిశుభ్ర పరిసరాలతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. నోటీసులు ఇచ్చేందుకు సర్వేలు చేస్తున్నామని రామగుండం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తెలిపారు. 50 డివిజన్లకు ఇద్దరేసి చొప్పున శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఖాళీ స్థలాలను గుర్తించి త్వరలో యజమానులకు నోటీసులు ఇస్తామని స్పందించకుంటే పురపాలక చట్టం నియమాలు అమలు చేస్తామని పేర్కొన్నారు.

పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో శివపార్వతీ నగర్, శాంతినగర్, రంగంపల్లి, లేక్‌వ్యూ కాలనీ, భూంనగర్, తెలుగువాడ ప్రాంతాల్లో 150 వరకు ఖాళీ స్థలాలు గుర్తించి యజమానులకు నోటీసులు ఇచ్చామని కమిషనర్ వెంకటేశ్ పేర్కొన్నారు.

మంథనిలో ఎక్కువగా లైన్‌గడ్డ ప్రాంతం, చైతన్యపురి కాలనీ, మంథని బస్‌డిపో పక్కన, శ్రీరామకాలనీ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఖాళీస్థలాలు ముళ్ల కంపలు, చెత్తచెదారాలతో డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. నోటీసులు ఇస్తున్నా యజమానులు స్పందించకపోవడంతో తాత్కాలికంగా యంత్రాలతో శుభ్రం చేయిస్తున్నారు.



సుల్తానాబాద్‌లో మార్కండేయ కాలనీ, స్వప్నకాలనీ, గాంధీనగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఖాళీ స్థలాలుండగా సంబంధిత అధికారులు నోటీసులు ఇవ్వలేదు.

నోటీసులు ఇచ్చినా స్పందనేదీ!

రామగుండం ప్రజారోగ్య విభాగంతో పాటు మూడు పురపాలికల పరిధిలో దాదాపు గరిష్ఠంగా 800 వరకు ఖాళీ స్థలాలుంటాయి. ప్రజారోగ్య భద్రత దృష్ట్యా పురపాలక శాఖ నిబంధనల ప్రకారం ఖాళీ ప్లాట్లపై ఆయా కమిషనర్లకు చర్యలు తీసుకునే అధికారం ఉంది. ఖాళీ స్థలం యజమానిని గుర్తించి ముందుగా నోటీసులు జారీ చేయాలి. వారం రోజుల్లోగా ప్లాటు శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. గడువు ముగిసినా యజమానులు పట్టించుకోకపోతే మున్సిపల్ కార్మికులు, యంత్రాలతో స్థలాన్ని చదును చేయించి గరిష్ఠంగా రూ. 5 వేల నుంచి స్థలాన్ని బట్టి జరిమానా విధించాలి. ప్రజారోగ్య విభాగ అధికారులు మాత్రం కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# సంరక్షణ పెరగాలి.. హరితం విరియాలి

పెద్దపల్లి : వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటే పనులు ఊపందుకున్నాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వాతావరణం అనుకూలంగా మారింది. రహదారుల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో ఉపాధిహామీ కూలీల చేత గుంతలు తవ్వించి మొక్కలు నాటుతున్నారు. ఇంటింటికీ ఆహ్లాదం పంచే వాటితో పాటు పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో ముందుగా 16 లక్షల లక్ష్యం నిర్దేశించి సన్నద్ధమయ్యారు. తాజాగా అది 27 లక్షలకు పెరగడం అధికారులకు సవాల్‌గా మారింది. సామూహిక వనాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించగా స్థలాల కొరత ఏర్పడింది. గతంలో ఎదురైన అడ్డంకులు అధిగమిస్తే ఆశయం నెరవేరుతుంది.

80 శాతం శాఖల్లో మొదలే లేదు

జిల్లాలో పెరిగిన లక్ష్యాలకు అనుగుణంగా వివిధ ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీలు, పరిశ్రమలకు మొక్కలు నాటే పనులు కేటాయించారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరామ్ పరిశ్రమలకు 3.85 లక్షలు, రామగుండం నగరపాలకసంస్థకు 2.45 లక్షలు, మున్సిపాలిటీల్లో పెద్దపల్లికి 1.20 లక్షలు, మంథనికి 50 వేలు, సుల్తానాబాద్‌కు 72 వేల మొక్కల లక్ష్యం నిర్దేశించారు. అధికంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 14.35 లక్షల లక్ష్యం విధించారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 4.49 లక్షల మొక్కలు నాటారు. గృహాలకు 7.05 లక్షలు పంపిణీ చేశారు.



దాదాపు 35 శాఖలను భాగస్వాములను చేయగా 80 శాతానికి పైగా శాఖల్లో ఒక్క మొక్క కూడా నాటలేదు. అదునులో మొక్కలు నాటితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

ప్రతి మొక్కకూ కంచె ఏర్పాటు

జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నాటే ప్రతి మొక్కకూ కంచె ఏర్పాటు చేస్తున్నాం. విడతల వారీగా నీటి తడులు అందించనున్నాం. సామూహిక వనాల పెంపకంపై పర్యవేక్షిస్తాం. లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాటిన ప్రతి మొక్కనూ బతికించాలి. ప్రజలకు అవసరమైన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయాలి. సంరక్షణ బాధ్యత తీసుకుంటేనే సార్థకత ఉంటుంది. ఇకపై మొక్కల పెంపకంపై ఆడిట్ నిర్వహించాలి.

ఇటీవల పెద్దపల్లిలో వన మహోత్సవం ప్రారంభంలో మంత్రి శ్రీధర్‌బాబుఆటంకాలు అధిగమిస్తేనే పచ్చదనం

అధికారులు మొక్కలు నాటడం వరకే పరిమితమవుతుండటంతో కంచె లేక పశువుల పాలవుతున్నాయి.

సంరక్షణ చర్యలు నామమాత్రంగా చేపట్టడం, నీటి తడులు అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇళ్లలో అవసరమైన మామిడి, బత్తాయి, ఇతర పండ్ల మొక్కలు పంపిణీ చేయడం ద్వారా సంరక్షణపై బాధ్యత పెరుగుతుంది. సాముహిక వనాల పెంపకంపై దృష్టి సారించాలి. పర్యవేక్షించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి.

# పైకి రాని భూగర్భ జలాలు

కరీంనగర్ : తెలంగాణకే ధాన్యాగారంగా ఉన్న జిల్లాలో వర్షాకాలంలోనూ ఎండలు మండిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులైనా ఒక్క పెద్ద వాన కురవకపోవడం రైతులకు అశనిపాతంగా మారింది. ఆశించిన వర్షాలు కురవకపోవడం, జలాశయాల్లోకి వరద చేరకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కిందటి ఏడాది జూన్‌లో జిల్లాలో 7.43 మీటర్ల లోతులో నీరు ఉండగా ఈ ఏడాది జూన్‌లో 8 మీటర్ల లోతుకు భూగర్భజలం పడిపోయినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈసారి 0.57 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. అత్యధికంగా గంగాధర మండలంలో 15.55 మీటర్ల లోతుకు పడిపోగా కరీంనగర్‌లో 14.62 మీటర్లు, చొప్పదండి మండలంలో 14.25 మీటర్లకు భూగర్భజలం పడిపోయింది. మానకొండూరు మండలంలో అత్యల్పంగా 2.80 మీటర్ల లోతులో నీరు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

జలాశయాలు వెలవెల..

వరప్రదాయనిగా ఉండాల్సిన సాగునీటి ప్రాజెక్టులు నీరులేక బోసిపోతున్నాయి. గోదావరి నది ఆధారంగా నీటితో కళకళలాడాల్సిన ఎస్సారెస్పీ వరద కాలువ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలు నీరు లేక అడుగంటిపోయాయి. ఇక చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. కొందరు అక్రమంగా చెరువుల్లోని మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 123.6 మి.మీ కాగా 14 రోజుల్లో 207.4 మి.మీ వర్షం కురిసింది. జులై 10 వరకు సాధారణ వర్షపాతం 57.9 మి.మీ కాగా మూడు రోజుల్లో కేవలం 38.1 మి.మీ వర్షం మాత్రమే నమోదైంది. జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగు 3,31,252 ఎకరాలు కాగా ఇప్పటికీ 54,903 ఎకరాల్లో మాత్రమే వేశారు. గతేడాది 94,759 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు కురవకపోతే పంటల సాగు కష్టమే అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

మనం మారుదామా..

గతేడాది అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయనుకుంటే.. ఈ ఏడాది సీజన్ ప్రారంభమై నెల దాటినా భారీ వర్షాలు పడలేదు. సాగు చేద్దామనుకునే రైతులు వెనుకముందు ఆలోచిస్తున్నారు. మరో పక్క వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఈసారీ సమృద్ధిగా వానలు కురవకుంటే కష్టాలు రెట్టింపు అవుతాయి. ఇప్పటికైనా ప్రజలు నీటిని ఒడిసిపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. అవసరమైన చోట ఇంకుడుగుంతలు తవ్వుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి.

దున్నిన మడులు ఎండిపోయి..

వరద కాలువ ఆధారంగా అయిదెకరాల్లో వరి పంట వేసేందుకు దున్నిన పొలం మడులు నీరు అందక ఎండిపోయాయి. వ్యవసాయ బావి, బోరు ఆధారంగా వేసిన వరి పంట కూడా వర్షాలు కురవక ఎండుముఖం పట్టింది. వానాలు కురవకపోతే పెట్టుబడులు మట్టిపాలవుతాయి. ఇక వరుణ దేవుడే మమ్మల్ని కాపాడాలి.చిరుత రమేశ్, గంగాధర




## ఏపీ అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్రం నిర్ణయాలు: చంద్రబాబు

అమరావతి: పోలవరం ప్రాజెక్టు, పరిశ్రమలకు సంబంధించి రెండు నోట్స్‌ను కేంద్రం క్లియర్ చేసింది. కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. పోలవరాన్ని 2027 మార్చిలోగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ ఏర్పాటు చేశారు. పోలవరం విషయంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు. పోలవరానికి కేంద్రం పెండింగ్ నిధులు ఇవ్వాలి. కేంద్రం ఇవ్వలేదని ఎప్పుడూ పోలవరం పనులు ఆపలేదు.

**కొత్త దయాఫ్రమ్ వాల్‌నిర్మిస్తాం..** 2019లో పోలవరం ప్రాజెక్టుకు శనిగ్రహం ఆవరించింది. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులకు గ్రహణం పట్టింది. 2021 నాటికి పోలవరం పూర్తి చేసి ఉండాలి. వైకాపా హయాంలో కేంద్రం రూ.8వేల కోట్లు ఇచ్చింది, పీపీపీ లేఖ కూడా రాసింది. ఐదేళ్లుగా పురుషోత్తమపట్నం, పట్టిసీమను ఉపయోగించుకోలేదు. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి మళ్లీ పోలవరాన్ని ట్రాక్‌లో పెట్టగలిగాం. ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం కలిగింది. చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యావాదాలు. పోలవరం చాలా సున్నితమైన ప్రాజెక్టు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోదాట్లో మునిగిన పోలవరం ఇప్పుడు మళ్ళీ గట్టెక్కింది. ఇప్పుడు కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మించడమే మేలని నిపుణులు తేల్చారు. రూ.992 కోట్లతో కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మిస్తాం. 41.15 మీటర్ల ఎత్తుతో మొదటి దశ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయాలన్నదే మా లక్ష్యం.

**ఏపీలో మూడు కారిడార్‌లు..** దేశంలో మొత్తం 12 పారిశ్రామిక కారిడార్‌లు నిర్మిస్తుంటే ఏపీలో మూడు కారిడార్‌లు ఉన్నాయి. వీటిపై మొత్తం రూ.28వేల కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్‌లు వస్తున్నాయి. కృష్ణపట్నానికి కూడా అనుమతిచ్చారు. నక్కపల్లికి ఫార్మా క్లస్టర్ కూడా వస్తోంది. ఇవన్నీ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కారణమవుతాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రానికి మంచి రోజు" అని చంద్రబాబు అన్నారు.




## 12 కొత్త స్మార్ట్ సిటీలు.. 10 లక్షల ఉద్యోగాలు: కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలివి

దిల్లీ: ఉత్పత్తి రంగానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. భారత్‌లో ఉత్పత్తి చేసేందుకు అనేక దేశాలు ముందుకొస్తున్నాయని, ఈ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని అన్నారు.

కేంద్ర కేబినెట్ సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను మంత్రి వెల్లడించారు. తయారీ రంగానికి మరింత ఊతమిచ్చేలా దేశంలోనే కొత్తగా 12 స్మార్ట్ పారిశ్రామిక నగరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 10లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని తెలిపారు. "రూ.28,602 కోట్ల పెట్టుబడితో 10 రాష్ట్రాల్లో 12 కొత్త పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్లు-కొప్పర్తి, తెలంగాణలోని జహీరాబాద్, రాజస్థాన్‌లోని జోధ్‌పుర్-పాలి, ఉత్తరాఖండ్‌లోని ఖుర్పియా, పంజాబ్‌లోని రాజ్‌పురా-పాటియాలా, మహారాష్ట్రలోని దిఘి, కేరళలోని పాలక్కడ్, యూపీలోని ఆగ్రా-ప్రయాగ్‌రాజ్, బిహార్‌లోని గయలో ఈ కారిడార్లను ఏర్పాటు చేయనున్నాం. ఈ ప్రణాళికలతో 10లక్షల మందికి నేరుగా ఉద్యోగాల కల్పన.. మరో 30లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఈ కారిడార్లు దాదాపు రూ.1.52 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తాయి" అని వివరించారు.

**కొప్పర్తి హబ్‌తో 54వేల మందికి ఉపాధి..** "కడప జిల్లా కొప్పర్తిలో పారిశ్రామిక హబ్ కింద 2,596 ఎకరాలను అభివృద్ధి చేస్తాం. దీని కోసం రూ.2,137కోట్లను ఖర్చు చేయనున్నాం. ఈ హబ్‌తో 54వేల మందికి ఉపాధి లభిస్తుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు లో 2,621 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం రూ.2,786కోట్లు వెచ్చించనున్నాం. దీంతో 45వేల మందికి ఉపాధి అవకాశాలు అందుతాయి. వీటితో రాయలసీమకు లబ్ధి చేకూరనుంది.

## ప్రజలను ఇబ్బంది పెట్టిన వాళ్లంతా రెడ్‌బుక్‌లో ఉన్నారు: మంత్రి లోకేశ



మంగళగిరి: ప్రజలను ఇబ్బంది పెట్టిన వాళ్లంతా రెడ్‌బుక్‌లో ఉన్నారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరిలో ఓ దాత నిర్మించిన నరసింహస్వామి ఆలయ ముఖ ద్వారాన్ని ఆయన ప్రారంభించారు. భక్తులకు స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చట్టానికి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై తప్పనిసరిగా చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్‌లపై నివేదిక రాగానే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఇద్దరు ప్రమాణస్వీకారం



అమరావతి: ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణం చేయించారు. ఇప్పటి వరకు వీరిద్దరూ అదనపు న్యాయమూర్తులుగా ఉన్నారు. వారిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని ఈ నెల 13న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇటీవల ఆమోదముద్ర వేశారు. జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. డిగ్రీ వరకు అక్కడే చదివారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 2008లో నేరుగా జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఫ్యామిలీ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు, సీబీఐ కోర్టు, వ్యాట్ ట్రిబ్యునల్ ఛైర్మన్, విశాఖపట్నం, ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాలకు ప్రధాన న్యాయమూర్తి(పీడీజే)గా పనిచేసిన అనంతరం హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు స్వస్థలం కృష్ణా జిల్లా చల్లపల్లి. 1994లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2007లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. మరోసారి పదోన్నతి పొంది 2016 నుంచి అదనపు జిల్లా జడ్జిగా శ్రీకాకుళం, తిరుపతిలో న్యాయసేవలు అందించారు. గుంటూరు మొదటి అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తుండగా హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

## ఇసుక లారీలు పట్టిచ్చినా సీఐ కేసు నమోదు చేయలేదు: ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి



అనంతపురం: ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినా తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి పట్టించుకోలేదని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు.

**నువ్వు ఎమ్మెల్యే అయితే నాకేంటి? జేసీ అస్మిత్‌రెడ్డితో సీఐ దురుసు ప్రవర్తన :** నెలరోజులుగా సీఐకి ఫిర్యాదు చేస్తున్నా స్పందన లేదని జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. తాము ఇసుక లారీలు పట్టుకొని అప్పగించినా కేసు నమోదు చేయడం లేదని ఆరోపించారు. అక్రమంగా ఇసుక తరలింపును పట్టిస్తే రాజీ కోసం స్టేషన్‌కు రావాలని పిలుస్తున్నారన్నారు. పట్టిచ్చిన లారీలపై కేసు పెట్టనందునే తాను పీఎస్‌కు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక దందాను కొనసాగనివ్వబోమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ తవ్వకాలపై విచారణ ప్రారంభమైందని చెప్పారు. ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. ఈ అక్రమాలను ఆపేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

## ఏపీ అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్రం నిర్ణయాలు: చంద్రబాబు



అమరావతి: పోలవరం ప్రాజెక్టు, పరిశ్రమలకు సంబంధించి రెండు నోట్స్‌ను కేంద్రం క్లియర్ చేసింది. కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. పోలవరాన్ని 2027 మార్చిలోగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ ఏర్పాటు చేశారు.
పోలవరం విషయంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు. పోలవరానికి కేంద్రం పెండింగ్ నిధులు ఇవ్వాలి. కేంద్రం ఇవ్వలేదని ఎప్పుడూ పోలవరం పనులు ఆపలేదు.
**కొత్త దయాఫ్రమ్ వాల్‌నిర్మిస్తాం..** 2019లో పోలవరం ప్రాజెక్టుకు శనిగ్రహం ఆవరించింది. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులకు గ్రహణం పట్టింది. 2021 నాటికి పోలవరం పూర్తి చేసి ఉండాలి. వైకాపా హయాంలో కేంద్రం రూ.8వేల కోట్లు ఇచ్చింది, పీపీపీ లేఖ కూడా రాసింది. ఐదేళ్లుగా పురుషోత్తమపట్నం, పట్టిసీమను ఉపయోగించుకోలేదు. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి మళ్లీ పోలవరాన్ని ట్రాక్‌లో పెట్టగలిగాం. ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం కలిగింది. చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యావాదాలు. పోలవరం చాలా సున్నితమైన ప్రాజెక్టు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోదాట్లో మునిగిన పోలవరం ఇప్పుడు మళ్ళీ గట్టెక్కింది. ఇప్పుడు కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మించడమే మేలని నిపుణులు తేల్చారు. రూ.992 కోట్లతో కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మిస్తాం. 41.15 మీటర్ల ఎత్తుతో మొదటి దశ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయాలన్నదే మా లక్ష్యం.
**ఏపీలో మూడు కారిడార్‌లు..** దేశంలో మొత్తం 12 పారిశ్రామిక కారిడార్‌లు నిర్మిస్తుంటే ఏపీలో మూడు కారిడార్‌లు ఉన్నాయి. వీటిపై మొత్తం రూ.28వేల కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్‌లు వస్తున్నాయి. కృష్ణపట్నానికి కూడా అనుమతిచ్చారు. నక్కపల్లికి ఫార్మా క్లస్టర్ కూడా వస్తోంది. ఇవన్నీ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కారణమవుతాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రానికి మంచి రోజు" అని చంద్రబాబు అన్నారు.




## వచ్చే నెల మొదటి వారంలో పర్యటన!

అమరావతి : రాష్ట్రంలో తొలి గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీగా 'క్రిస్ సిటీ' పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కృష్ణపట్నం సిటీ (క్రిస్ సిటీ) పనులకు ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ చేయనున్నట్లు సమాచారం. సెప్టెంబరు మొదటి వారంలో ప్రధాని పర్యటన ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

అలా కాకుంటే.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని (సెప్టెంబరు 20న) ప్రధాని పర్యటన ఉండేలా మరో ప్రతిపాదనను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధాని పర్యటన తేదీ ఖరారు కోసం ఆయన కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇది ఖరారైతే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోదీ తొలిసారి రాష్ట్ర పర్యటనకు వస్తున్నట్లవుతుంది. ప్రధాని రాక వీలుకాకుంటే.. వర్చువల్ విధానంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో..** చెన్నై- బెంగళూరు పారిశ్రామిక నడవాలో భాగంగా క్రిస్ సిటీ అభివృద్ధికి గత తెదేపా ప్రభుత్వం (2014-19) కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చింది. గత ఐదేళ్లలో వాటికి టెండర్లు ఖరారు చేసి, పనులు ముందుకు తీసుకెళ్లడంలో జగన్ ప్రభుత్వం జాప్యం చేసింది. ఎన్నికలకు ముందు హడావుడిగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్) భాగస్వామ్యంతో చేపట్టారు. సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలకు భవిష్యత్తు బాగున్న నేపథ్యంలో క్రిస్ సిటీ, అచ్యుతాపురం సెజ్‌ల్లో ఆ తరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మూడు దశల్లో 11,096 ఎకరాల్లో క్రిస్ సిటీ :** అంతర్జాతీయ ప్రమాణాలతో 'క్రిస్ సిటీ' ఏర్పాటుకు జాకబ్స్ ఇంజినీరింగ్ గ్రూప్.. మాస్టర్‌ప్లాన్, నమూనాలను రూపొందించింది. మూడు దశల్లో 11,095.90 ఎకరాల్లో క్రిస్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. తొలిదశలో 2,134 ఎకరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,054.6 కోట్లతో ఏపీఐఐసీ రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ ప్రమాణాలతో గ్రీన్ జోన్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, పని ప్రదేశంలో నివాస ప్రాంతాలు, ఫుడ్ కోర్టు, పని షెడ్లు.. ఇవన్నీ కలిపి ఒక అత్యాధునిక నగరాన్ని నిర్మించాలన్నది ప్రభుత్వం ఆలోచన. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద భూములను సమకూర్చితే.. మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిక్‌డిక్ట్ నిధులిస్తుంది. ఈ నోడ్‌లో తొలిదశలో చేపట్టిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల ద్వారా సుమారు రూ.18,458 కోట్ల పెట్టుబడులు, 88 వేల మందికి ఉపాధి లభిస్తాయని అంచనా. కృష్ణపట్నం పోర్టు, సముద్ర తీరం వెంబడి సాగరమాల ప్రాజెక్టు కింద రహదారులను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. దీనివల్ల రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండటమే కాకుండా బెంగళూరు, అనంతపురం, విజయవాడ, చెన్నై నగరాలకు రోడ్డు కనెక్టివిటీ ఏర్పడుతుంది.


## ఏపీలో సాగునీటి సంఘాల ఎన్నికలు.. కేబినెట్ కీలక నిర్ణయాలివే!

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది.



ఈ సందర్భంగా కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను సమావేశం అనంతరం మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. సీఎం పేషీ, సీఎంవో అధికారుల పేషీల్లో 71 పోస్టుల భర్తీకి మంత్రి వర్గం ఆమోదం. మంత్రుల పేషీల బలోపేతం కోసం 96 పోస్టులకు ఆమోదం. కొత్తగా ఏర్పాటు చేయబోయే రేషన్ దుకాణాల్లో ఈ- పాస్ మిషన్ల కొనుగోలుకు రూ.11.51 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం. రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేసిన మంత్రివర్గం. పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు ఆమోదం. పోలవరం ఎడమ కాల్వ పనుల పునరుద్ధరణకు కేబినెట్ ఆమోదం. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దుకు కేబినెట్ తీర్మానం. పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో, రాజకీయ పార్టీల లోగో తొలగించేందుకు ఆమోదం. 21.86లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలపై కొత్తగా ప్రభుత్వ అధికారిక చిహ్నం.

## మంత్రుల వందరోజుల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టు: సీఎం చంద్రబాబు



అమరావతి: వంద రోజుల పనితీరుపై మంత్రులకు ప్రోగ్రెస్ రిపోర్టు ఇవ్వనున్నట్టు సీఎం చంద్రబాబు అమాత్యులతో అన్నారు. జనసేన మంత్రుల రిపోర్ట్ పవన్ కల్యాణ్‌కు అందజేస్తామని చెప్పారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు వివాదాస్పదంగా వ్యవహరించడంపై చంద్రబాబు సీరియస్ అయినట్టు తెలిసింది. కొందరు చేసే తప్పిదాల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మీతిమీరకుండా చూసుకోవాల్సిన బాధ్యత మంత్రులు.. ఎమ్మెల్యేలదే అని వెల్లడించారు. ఒకరిద్దరు చేసే తప్పిదాల వల్ల ప్రభుత్వం చేసే మంచి అంతా పోయి, నేతల తీరే హైలెట్ అవుతోందని సీఎం వ్యాఖ్యానించినట్టు సమాచారం.

క్యాబినెట్ భేటీ ముగిశాక అంతర్గతంగా రాజకీయ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. రివర్స్ టెండరింగ్ విధానంపై ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య కీలక చర్చ జరిగింది. గత ప్రభుత్వం మాయ చేయడానికే రివర్స్ టెండరింగ్ విధానం ప్రవేశపెట్టిందని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఇసుక పాలసీ ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని చంద్రబాబు అన్నారు.

## వైకాపాకు ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా

**అమరావతి: వైకాపాకు మరో షాక్ తగిలింది. ఎమ్మెల్సీ పోతుల సునీత ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు వైకాపా అధినేత జగన్‌కు లేఖ పంపారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు శాసనమండలి కార్యదర్శికి లేఖ అందజేశారు.**



## ఆషురెడ్డి.. నల్లని డ్రెస్సులో స్టన్నింగ్!

సోషల్ మీడియాలో భారీగా ఫాలోవర్లు కలిగిన ఆషురెడ్డి, ఈరోజుల్లో పాపులర్ ఫేస్ గా మారిపోయింది. మొదట చిన్న చిన్న డబ్ స్మాష్ వీడియోల ద్వారా ప్రేక్షకుల మనసు గెలుచుకున్న ఆషు, ప్రత్యేకించి తన లుక్స్ వల్ల, జూనియర్ సమంతగా అనిపించుకుంది. ఈ ఇమేజ్ ఆమెకు తొందరగానే గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ తర్వాత టెలివిజన్ రియాలిటీ షోలు, ముఖ్యంగా బిగ్ బాస్ లో ఆమె కనిపించడంతో ఆమె క్రేజ్ మరింత పెరిగింది. బిగ్ బాస్ షోలో రెండు సార్లు పార్టిసిపేట్ చేయడం ద్వారా ఆమెకు సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. బిగ్ బాస్ తర్వాత ఆషురెడ్డి ఒక సెలబ్రిటీగా మరింత పాపులర్ అయ్యింది. ఆమె కేవలం రియాలిటీ షోలతోనే కాకుండా, టీవీ మరియు ఓటీటీ షోలలో హొస్ట్‌గా కూడా తన మార్కును సృష్టించింది. ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా యాక్టివ్ గా ఉంటూ, ఫ్యాన్స్‌తో ప్రతి రోజు టచ్‌లో ఉంటుంది. ముఖ్యంగా రామ్



గోపాల్ వర్మతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూ ఒక సెన్సేషన్‌గా మారింది. ఆ ఇంటర్వ్యూ ఆమెకు కొత్త ఇమేజ్ తీసుకొచ్చింది. కెరీర్ ఆరంభంలో కాస్త బొద్దుగా కనిపించిన ఆషు, ప్రస్తుతం స్లిమ్ అవతార్‌లో మారిపోయి, తన గ్లామర్ షోతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆమె పాపులారిటీకి తగినట్లుగా, ఆమె గ్లామర్ ప్రదర్శన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా విస్తరించింది. రెగ్యులర్ గా గ్లామరస్ ఫోటోషూట్లను పోస్ట్ చేస్తూ అభిమానులకు కావాల్సిన వినోదాన్ని అందిస్తోంది. ఆమె పోస్ట్ చేసే ఫోటోలు ప్రతీసారీ వైరల్ అవుతుండటం, ఆమె క్రేజ్‌ను మరింత పెంచుతోంది. ఇంకా ఆమె కెరీర్ పరంగా కూడా టాలీవుడ్ లో అడుగు పెట్టింది. చల్ మోహన రంగా అనే చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన ఆషు, ఆ తర్వాత లిబాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్ అనే సినిమాలో హీరోయిన్ గా కనిపించింది. ప్రస్తుతం ఆమె ఏ మాస్టర్ పీస్ అనే సూపర్ హీరో మూవీలో నటిస్తోంది. ఈ ప్రాజెక్ట్ తో ఆమె నటిగా తన ప్రతిభను నిరూపించుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇక ఆమె సినిమాలకు సంబంధించి మరికొన్ని ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి.

## మూడేళ్లగా మిస్ యూనివర్స్ సింగిల్ గానే!

మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్ ప్రేమాయాణాలు..వాటి బ్రేకప్ స్టోరీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటి వరకూ సుస్మితాసేన్ ఖాతాలో 11 మంది తో డేటింగ్ చేసింది. ప్రస్తుతం ఆ 11 నెంబర్ కూడా వీగిపోయింది. మళ్లీ ఓల్డ్ బోయ్ ఫ్రెండ్ రోహ్మాన్ షానే మళ్లీ తెరపైకి తెస్తుంది? అన్న ప్రచారం కూడా సాగింది. కానీ ఇంతవరకూ అధికారికంగా ప్రకటించింది లేదు. అప్పుడప్పుడు జంటగా బయట మాత్రం కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సుస్మితాఖాన్ రిలేషన్ షిప్ పరోక్షంగా హిట్ ఇంచ్చింది. నా జీవితంలో ఇప్పుడు ఏ పురుషుడు లేడు. మూడేళ్లగా సింగిల్ గానే ఉంటున్నా. ప్రేమ, బంధం అనే వాటి వెనుక పరిగెత్తే ఆలోచన కానీ, ఆసక్తికానీ రెండు లేవు. అంతకు ముందు ఒకరితో ఐదేళ్ల పాటు రిలేషన్ లో ఉన్నాను. ఆ బ్రేకప్ తర్వాత ఎంతో స్వేచ్ఛగా జీవిస్తున్నాను. అలాగే నేనిప్పుడు పెళ్లి



చేసుకుంటానంటే నా పిల్లలు కూడా ఒప్పుకోవడం లేదు. ఓ అబ్బాయిని పెళ్లి చేసుకుంటే ఎలా ఉంటుందని మా పెద్దమ్మాయిని అడిగితే అతడినే కాదు..ఎవర్నీ పెళ్లి చేసుకోవద్దు అని చెబుతుంది. వివాహం చేసుకోవాల్సిన అవసరం ఏముంది? నీకు నచ్చినట్లు నీ జీవితాన్ని గడుపు. పెళ్లి గురించి ఆలోచించాల్సిన పనేముందని ప్రశ్నిస్తుంది అని తెలిపింది. పిల్లలు అంటే సుస్మితాసేన్ పేగు తెంచుకుని పుట్టిన వారు అనుకునేరు. ఆమె దత్తత తీసుకున్న పిల్లలు. వీళ్లని సొంత పిల్లలుగా చూసుకుంటుంది. మంచి చదువులు చెప్పిస్తోంది. ఇక సుస్మితాసేన్ కెరీర్ సంగతి చూస్తే చాలా కాలం తర్వాత తాలీ అనే వెబ్ సిరీస్ లో నటించి ఇండస్ట్రీని షేక్ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ట్రాన్స్ జెండర్ పాత్రలో నటించి ఇండియానే ఆడించింది. ట్రాన్స్ జెండర్స్ హక్కుల కోసం పోరాడిన 'గౌరీ సావంత్' జీవితం ఆధారంగా తెరకెక్కిన సిరీస్ లో సుస్మితా సేన్ నట విశ్వరూపం చూపించింది. ఇండియా మొత్తం ఆమె గురించి మాట్లాకునే రేంజ్ లో నటించింది.




## మెగా హీరోల మధ్య దూరం.. ఇది మరో ఉదాహరణ?





రాజకీయాల పరంగా ప్రతి ఒక్కరికి వ్యక్తిగత అభిమానాలు, ఇష్టాలు ఉంటాయి. ఇక ఈ క్రమంలో కొంత గ్యాప్ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ పెరిగిన దూరాన్ని తగ్గించే వారికంటే మరింత పెంచే వారే సమాజంలో ఎక్కువగా ఉంటారు. అసలు ఈ సంగతి అంతా ఇప్పుడు ఎందుకంటే మెగా, అల్లు కుటుంబాలను ఫ్యాన్స్ ఎప్పుడు వేరుగా చూడలేదు. పండుగలు, ఫ్యామిలీ సెలబ్రేషన్స్ అన్ని కూడా అందరూ కలిసి చేసుకునేవారు.

అయితే ఈ రెండు కుటుంబాల మధ్యలోకి రాజకీయాలు చేరాయి. 2024 ఎన్నికల సమయంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన స్నేహితుడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తరుపున ఎన్నికల ప్రచారం చేశారు. అయితే మెగా ఫ్యామిలీ హీరోలైన రామ్ చరణ్, వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్ అందరూ పవన్ కళ్యాణ్ తరపున పిఠాపురంలో ప్రచారం చేశారు. చరణ్ పిఠాపురంలో ప్రచారంలో పాల్గొన్న చివరి రోజు అల్లు అర్జున్ నంద్యాలలో వైసీపీ అభ్యర్థి తరపున ఎన్నికల కాంపెయిన్ చేశారు. ఇది మెగా ఫ్యాన్స్ కి, జన సైనికులకు అస్సలు మింగుడుపడలేదు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత నాగబాబు ట్విట్టర్ లో చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. రెండు రోజులకి ట్వీట్ డిలీట్ చేసిన అది అల్లు అర్జున్ గురించే అనే ప్రచారం తెరపైకి వచ్చింది. అప్పటి నుంచి ఈ అల్లు వెర్సస్ మెగా వివాదం ఫ్యాన్స్ మధ్య సోషల్ మీడియాలో నడుస్తోంది. పవన్ కొన్ని కొన్ని రోజుల క్రితం బెంగుళూరులో అధికారులతో మాట్లాడుతూ ఒకప్పుడు అడవిని రక్షించేవారిని హీరోలుగా సినిమాలలో చూపించేవారు. ఇప్పుడు చెట్లు నరికే స్మగ్లర్స్ ని హీరోలుగా చిత్రీకరిస్తున్నారు అని కామెంట్స్ చేశారు. ఇది పుష్పలో అల్లు అర్జున్ క్యారెక్టర్ ని ఉద్దేశించి చేసినవే అనే విమర్శలు వచ్చాయి. ఈ వివాదం నడుస్తూనే ఉంది. అయితే ఇది కేవలం ఫ్యాన్ వార్ కాదని, రెండు కుటుంబాల మధ్య దూరం పెరిగిందనే మాట ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో పుష్ప ది రూల్ షూటింగ్ తో పాటు వరుణ్ తేజ్ మట్కా, సాయి ధరమ్ తేజ్ కొత్త సినిమాలు షూట్స్ కూడా జరుగుతున్నాయంట. ఈ ముగ్గురి సినిమాల షూటింగ్స్ పక్క పక్కనే జరుగుతున్న కూడా వరుణ్ తేజ్, సాయి తేజ్ అల్లు అర్జున్ ని కలవలేదంట. అలాగే బన్నీ కూడా వరుణ్, తేజ్ లలో ఎవరిని కలిసే ప్రయత్నం చేయలేదంట. సాయి, వరుణ్ కలుసుకున్నా కూడా వారు ఇద్దరు బన్నీని కలవకపోవడంతో ఈ విషయం మరింత హాట్ టాపిక్ గా మారింది. ఒకరికి ఒకరు సంబంధం లేనట్లు షూటింగ్స్ చేసుకుంటున్నారని టాక్ అయితే వైరల్ అవుతోంది.

ఈ న్యూస్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. అందరూ గొప్పగా చెప్పుకునే మెగా కాంపౌండ్ లో రాజకీయం చిచ్చు పెట్టిందనే మాట ఇప్పుడు వినిపిస్తోంది. మరి ఈ వివాదానికి ఎప్పుడు ముగింపు కార్డు పడుతుందో చూడాలి.

## టాలీవుడ్ డిసెంబర్ లెక్క ఫైనల్ గా తేలేదెన్ని?



టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ ఏడాది ప్రథమార్ధం లో ఆశించిన స్థాయిలో సక్సెస్ లు లేవు. అలాగే ఫేమ్ ఉన్న సినిమాలు రిలీజ్ కూడా తక్కువగానే జరిగాయి. వాటిలో కరెక్ట్ గా చూసుకుంటే హనుమాన్, డీజే టిల్లు, కల్కి 2898ఏడీ సినిమాలు మాత్రమే బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. మరికొన్ని సినిమాలు కమర్షియల్ సక్సెస్ అందుకున్నాయి. చాలా వరకు సినిమాల డిజాస్టర్ టాక్ తెచ్చుకొని నిర్మాతలకి ఫైనాన్షియల్ గా నష్టాలు తీసుకొచ్చాయి. అయితే ఈ ఏడాది సెకెండాఫ్ మాత్రం టాలీవుడ్ ప్రేక్షకులకి అయితే మంచి రోజులు అని చెప్పొచ్చు. టైర్ 1, టైర్ 2 హీరోలు చేస్తోన్న సినిమాలలో చాలావరకు ద్వితీయార్ధంలోనే రానున్నాయి. ప్రతి నెల గుర్తింపు ఉన్న సినిమాలు 2-3 రిలీజ్ కాబోతున్నాయి. వాటిలో చాలా సినిమాలపై పాజిటివ్ వైబ్ ఉంది. అయితే ఈ ఏడాది ఆఖరున డిసెంబర్ మాత్రం నిర్మాతలకి పెద్ద తలనొప్పిగా మారిందని చెప్పాలి. డిసెంబర్ లో ఇప్పటికే అఫీషియల్ గా మూడు సినిమాలు టాలీవుడ్ నుంచి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసుకున్నాయి. మరో మూడు, నాలుగు సినిమాలు కూడా డిసెంబర్ లో రిలీజ్ కి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా కోసం దేశ వ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ తర్వాత నితిన్ రాబిన్ హుడ్ డిసెంబర్ 20న రిలీజ్ కానుంది. ఈ సినిమాపై నితిన్ చాలా హొప్స్ పెట్టుకున్నారు. అలాగే అక్కినేని నాగ చైతన్య హీరోగా తెరకెక్కుతోన్న తండేల్ మూవీ డిసెంబర్ 20న పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ కానుంది. ఈ మూడు సినిమాలు మాత్రమే కాకుండా తమిళ్ నుంచి కొన్ని డబ్బింగ్ సినిమాలు డిసెంబర్ నెలలో రిలీజ్ కాబోతున్నాయి. రామ్ చరణ్, శంకర్ కాంబినేషన్ లో రెడీ అవుతోన్న గేమ్ చేంజర్ మూవీని కూడా డిసెంబర్ లోనే రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. నిజానికి ముందుగానే రిలీజ్ అనుకున్న కూడా పోస్ట్ ప్రొడక్షన్ అయ్యేసరికి లేట్ అవుతుందని డిసెంబర్ లో రావాలని అనుకుంటున్నారంట. నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న NBK109 మూవీ కూడా డిసెంబర్ లోనే రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

పుష్ప ది రూల్ మూవీ వాయిదా పడితే ఆ డేట్ కి NBK109 సినిమాని రిలీజ్ చేయాలనీ అనుకుంటున్నారంట. అలాగే మంచు విష్ణు కన్నప్ప సినిమాని డిసెంబర్ లో రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించాడు. డేట్ మాత్రం ఇంకా కన్ఫర్మ్ చేయలేదు. ఓవరాల్ గా చూసుకుంటే డిసెంబర్ నెలలో 6 తెలుగు సినిమాలు థియేటర్స్ లోకి రాబోతున్నాయి. వీటిలో ఎన్ని ఫైనల్ గా ఆ నెలలో రిలీజ్ కి అందుబాటులోకి వస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## శ్రీకృష్ణుడిగా ఈ స్టార్ హీరో యాప్ట్

టాలీవుడ్ హిస్టరీలో శ్రీకృష్ణుడిగా నటించిన చాలా మంది హీరోలు ఉన్నారు. కానీ లార్డ్ కృష్ణ స్ఫురద్రూపాన్ని తలుచుకోగానే ముందుగా గుర్తుకొచ్చేది నవరసనటసార్వభౌముడు నందమూరి తారక రామారావు. ఆయనను అభిమానులు సాక్షాత్తూ కృష్ణుని అవతారంగా కొలుస్తారు. అంతగా తారక రాముడు ఆ పౌరాణిక పాత్రకు యాప్ట్ అయ్యారు. ఆయన ఫోటోనే దేవుని గదుల్లోను పెట్టుకుని పూజించిన రోజులున్నాయి. అయితే తారక రాముని తర్వాత మళ్లీ ఆ పాత్రకు ఎవరు యాప్ట్? అంటే దానికి రకుల్ ప్రీత్ సింగ్ ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. ఈ సోమవారం నాడు శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని భారతదేశంతో పాటు దాదాపు 170 దేశాల్లో శ్రీకృష్ణుని భక్తులు స్వామివారికి పూజలాచరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులతో పాటు, క్రిస్టియన్లు, ముస్లిములు దేవాది దేవుడు లార్డ్ శ్రీకృష్ణుని 'అంతర్జాతీయ కృష్ణ సేవా సమాజం (ఇస్కాన్)' ని సందర్శించడం సర్వత్రా చర్చనీయాంశం. ఇదే సమయంలో కృష్ణ భక్తురాలు రకుల్ ప్రీత్ సింగ్ కి ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. భారతీయ ఇతిహాసమైన మహాభారతాన్ని ఎప్పుడైనా సినిమాగా ప్లాన్ చేస్తే, శ్రీకృష్ణుడి పాత్రను రూపొందించడానికి ఆదర్శవంతమైన హీరో ఎవరు? అనేదానిపై ఇటీవల రకుల్ ప్రీత్ సింగ్ తన అభిప్రాయాన్ని షేర్ చేసింది. రకుల్ తొలిగా తన చిన్ననాటి జన్మాష్టమి వేడుకలను కూడా గుర్తుచేసుకుంది. చిన్నప్పుడు స్కూల్‌లో మేము దహీ హండి గురించి చాలా ఉత్సాహంగా



ఉండేవాళ్లం. ఈ వేడుకలో పాల్గొనడం చాలా సంతోషకరమైన అనుభవం. ఎనర్జీతో పాటు టీమ్ వర్క్ ఈ పండుగ స్ఫూర్తి. అలాగే గత ఏడాది నేను మహారాష్ట్రలోని దహీ హండికి మొదటిసారిగా హాజరయ్యాను. ఆ అనుభవం నిజంగా అద్భుతమైనది... అని తెలిపింది. అంతేకాదు పాఠశాల నాటకంలో రాధ పాత్రను నేను పోషించినట్లు గుర్తుంది. అందమైన ఘూన్‌ఘట్, ఆభరణాలు, పూలతో సంప్రదాయ వస్త్రధారణలో కనిపించడం చాలా ఉత్సాహంగా అనిపించింది. వేదికపై ప్రదర్శనలు ఇవ్వడం, నృత్యం చేయడం, స్నేహితులతో కలిసి ఆ వేడుకలో భాగం కావడం స్వచ్ఛమైన ఆనందాన్నిచ్చింది.. అని తెలిపింది. అలాగే తాను 'మధుర'ను సందర్శించినప్పటికీ జన్మాష్టమి సమయంలో నగరాన్ని సందర్శించే అవకాశం ఆమెకు ఎప్పుడూ లభించలేదని తెలిపింది. జన్మాష్టమి సమయంలో నేను అక్కడికి వెళ్లాలి, అది చాలా ప్రత్యేకంగా ఉంటుంది. అక్కడ ఉన్న శక్తి, ఆత్మ - భక్తితో సెలబ్రేషన్ చేస్తారు. ఇది చాలా అందమైన వేడుకగా ఉంటుంది. శ్రీకృష్ణుని సన్నిధిలోని గొప్ప అనుభూతితో ఒక దివ్య ప్రపంచంలోకి అడుగు పెట్టడం ఆనందాన్నిస్తుంది.. అని తెలిపింది. మహాభారతాన్ని సినిమాగా తీస్తున్నారా? కృష్ణుడి పాత్రను ఎవరు పోషించాలని మీరు అనుకుంటున్నారు? అని ప్రశ్నించగా.. శ్రీకృష్ణుడు బహుముఖ పాత్రలతో తెలివైనవాడు, కొంటెవాడు, మనోహరమైనవాడు.. లోతైన ఆధ్యాత్మిక భావనను కలిగిస్తాడు. ఈ లక్షణాలన్నింటినీ సమతుల్యం చేయగల ఆదర్శవంతమైన హీరో ఎవరున్నారు? అని అంటే..బహుశా మహేష్ బాబు లేదా హృతిక్ రోషన్.. అని రకుల్ అన్నారు. ఆ ఇద్దరిలో ఎవరైనా కృష్ణుడి ఉల్లాసభరితమైన లోతైన పార్శ్వాలను తన శక్తి , బహుముఖ ప్రజ్ఞతో తెరపైకి తీసుకురాగలరు అని వ్యాఖ్యానించింది.

## అరియానా పాప స్టన్నింగ్ లుక్స్.. ఫిదా అవ్వాల్సిందే..

అరియానా గ్లోరీ.. హీరోయిన్లకు మించిన క్రేజ్ ను సోషల్ మీడియా ద్వారా సంపాదించుకున్న విషయం తెలిసిందే. నార్మల్ యాంకర్ గా ఉన్న అరియానా.. ఆర్జీవీని ఇంటర్వ్యూ చేసి ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చేసింది. అందులో అరియానా తొడలపై రామ్ గోపాల్ వర్మ చేసిన వెకిలి కామెంట్లు అప్పట్లో తెగ వైరల్ అయ్యాయి. దీంతో విపరీతమైన పాపులారిటీని దక్కించుకుంది. ఆ క్రేజ్ కారణంగానే బిగ్ బాస్ ఆఫర్ కొట్టేసింది అమ్మడు. అయితే బిగ్ బాస్ షోలో తన అందం, ఆటతో అందరినీ అలరించింది. తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చాక కూడా ఆర్జీవీతో కలిసి వర్కౌట్స్, ఇంటర్వ్యూలు చేస్తూ మళ్ళీ సంచలనం సృష్టించింది. కొత్తవి, పాతవి అలా అన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. ఆ తర్వాత పలు షోలకు యాంకరింగ్ చేసి సందడి చేసింది బ్యూటీ. ప్రస్తుతం అనేక వెబ్ సిరీసుల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. తనను తాను ప్రమోట్ చేసుకోవడంలో భాగంగా.. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తుంటోంది అరియానా. గ్లామర్ ట్రీట్స్ ఇస్తూ కుర్రాళ్ల మతులు పోగుడుతుంటోంది. స్కిన్ షోలో హద్దులు



చెరిపేసి పోజులు ఇస్తోంది అమ్మడు. హీరోయిన్లతో సమానంగా ఫోటో షూట్స్ చేస్తూ అదరగొడుతుంటోంది. తన లేలేతప్రాయాలను నెట్టింట షేర్ చేస్తూ అలరిస్తుంటోంది. తాజా అదిరిపోయే పిక్స్ ను షేర్ చేసింది అరియానా. టార్న్ జీన్ ప్యాంట్, వైట్ ఇన్నర్ తో ఫోటోలు దిగి మైండ్ బ్లాక్ చేసింది అమ్మడు. నాభి, ఎద అందాలతో కవ్విస్తోంది. నడుమును వయ్యారంగా చూపిస్తూ మాయ చేస్తోంది. హీట్ పుట్టించే ఫోజులతో సెగలు పుట్టిస్తోంది. ఓ రేంజ్ లో ఎక్స్ప్రెసన్స్ ఇస్తూ అందరినీ ఫ్లాట్ చేస్తోంది. స్టన్నింగ్ లుక్స్ తో ఫిదా చేస్తోంది.

మోడ్రన్ ఔట్ ఫిట్ లో అమ్మడు దిగిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆరియానా పిక్స్ చూసి ఫ్లాట్ అయిన కుర్రాళ్ళు.. లైకుల వర్షం కురిపిస్తున్నారు. ఫైర్ ఎమోజీస్ పెడుతూ కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. అమ్మడి బ్లాస్టింగ్ అందాలు చూసి మైమరచిపోయినట్లు చెబుతున్నారు. బ్యూటీ అందాల జాతరకు ఎవరైనా ఫ్లాట్ అవ్వకుండా ఉంటారా అని అంటున్నారు. బిగ్ బాస్ పిల్ల పిక్స్ ను తెగ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు. మరి యూత్ కు నిద్ర లేకుండా చేస్తున్న అరియానా పిక్స్ ను మీరు చూశారా?




హైదరాబాద్: ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సీడబ్ల్యూసీ సభ్యుడు పల్లంరాజు నిర్మాణాన్నే హైడ్రా మొదట కూల్చివేసింది. జన్వాడ ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారు.. సర్పంచ్‌లు కాదని పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు తెలియదా?నా కుటుంబం కబ్జా చేసినట్లు కేటీఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తా. విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం. హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకే మొదటి ప్రాధాన్యం. 30 ఏళ్ల కింద కట్టిన అక్రమ నివాస కట్టడాలైనా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. భారాస నేత హరీశ్‌రావు సిద్ధమైతే ఆయన నేతృత్వంలోనే చెరువుల ఆక్రమణలపై నిజ నిర్ధరణ కమిటీ వేస్తాం. హైడ్రా కూల్చివేతలపై ఒత్తిళ్లు వస్తున్నాయి.. అయినా ఎదుర్కొంటాం.. వెనక్కి తగ్గేది లేదు" అని సీఎం వ్యాఖ్యానించారు.



# పేరు ప్రస్తావించకుండా కేసీఆర్ పై రేవంత్ నిప్పులు!!

హైదరాబాద్ : సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లలో తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని అన్నారు. రాజకీయ విమర్శల జోలికి పోను కానీ... అంటూనే గత పాలకులపై ఫైరయ్యారు. అవును... సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి... 2014 నుంచి 2024 వరకూ సుమారు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నవాళ్లు ఎన్నెన్నో నిర్మించామని, ప్రపంచానికే ఆదర్శంగా నిలబడ్డామని గొప్పలు చెప్పుకుంటారు కానీ... తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెరమరుగు చేశారని విమర్శించారు. ఎందుకంటే... తెలంగాణ తల్లి కంటే వారే ప్రాధాన్యత, వారే తెలంగాణకు సర్వం, నేనే తెలంగాణ.. తెలంగాణే నేను అన్నట్లుగా గత పాలకులు వ్యవహరించారని తెలిపారు. అటువంటి పాతవిధానాలకు ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విరుద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతి భవన్ ప్రస్థావనను తీసుకొచ్చారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇందులో భాగంగా... గత పాలకులు ప్రగతి భవన్ పేరు చెప్పి పెద్ద గడీని ఏర్పాటు చేసుకుని, చుట్టూ ముళ్లకంచెలు పెట్టుకున్నారని.. వందల సంఖ్యలో పోలీసుల పహారా మధ్య వారు భద్రంగా అక్కడ ఉండి, తెలంగాణ ప్రజలకు ప్రవేశం లేదని నిషేధించారని తెలిపారు. అలాంటి ప్రగతి భవన్ ను ప్రజా భవన్ గా మార్చినట్లు తెలిపారు. అలాంటి ప్రగతి భవన్ అనే గడీని.. నేడు తెలంగాణ ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే ప్రదేశంగా మార్చినట్లు తెలిపారు! ఇక సచివాలయం అంటే తెలంగాణ పరిపాలనకు గుండె అని.. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ఇక్కడి నుంచే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని.. అయితే గత పాలకులు మాత్రం సచివాలయంలో అందుబాటులో ఉండేవారు కాదని ఫైరయ్యారు. ఇక, దసరాకు మంచి రోజులు లేవని.. అందుకే ఇవాళ భూమిపూజ చేసినట్లు చెప్పిన రేవంత్ రెడ్డి... రాష్ట్ర ప్రజలకు పండగ రోజైన డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు!

# ఒవైసీ, మల్లారెడ్డి కళాశాలలపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్: రాజకీయ చదరంగంలో హైడ్రా పావుగా మారదలుచుకోలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. "ఒవైసీ, మల్లారెడ్డి అనేది చూడం. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తాం. చెరువులను ఆక్రమించి కళాశాల భవనాలు కట్టడం వాళ్ల పొరపాటు అయి ఉండొచ్చు. ఎఫ్‌టీఎల్ అనేది ముఖ్యమైన అంశమే, దానికంటే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం. ఒవైసీ, మల్లారెడ్డి లాంటి వ్యక్తుల కళాశాలలకు సమయం ఇస్తాం. పార్టీలకు అతీతంగా మా చర్యలు ఉంటాయి. ధర్మసత్రమైనా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే కూల్చేస్తాం. హైడ్రా నోటీసులు ఇవ్వదు.. కూల్చడమే" అని రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలోని పలు చెరువులు, పార్కుల ఆక్రమణలపై మంగళవారం పలువురు భాజపా కార్పొరేటర్లు హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీలక వ్యాఖ్యలు చేశారు.



**హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు...** హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయానికి మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో ఫిర్యాదు దారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు క్యూ కడుతున్నారు. దీంతో హైడ్రా కార్యాలయానికి రోజు రోజుకీ తాకిడి పెరుగుతోంది. మొదట్లో పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు.. హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి చేరాయి. వాటన్నింటినీ స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. మరోవైపు ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు పెంచారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద మరోసారి అధికారుల సర్వే

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామంలోని ఫామ్‌హౌస్ వద్ద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ఆర్ఐ తేజ, మండల సర్వేయర్ సాయితేజ సహా ఇరిగేషన్ శాఖకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం.. నక్ష, డీజీపీఎస్ యంత్రాలతో సర్వే చేస్తోంది. జన్వాడ ఫామ్‌హౌస్ పక్క నుంచి ఫిరంగి నాలా (బుల్కాపూర్ కత్వా) ప్రవహిస్తోంది. నాలాలో ఫామ్‌హౌస్ ప్రహరీగోడ, గేటు నిర్మించారని ఆరోపణలున్నాయి. జన్వాడ ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.



# సారూ.. చెరువు కనిపించట్లేదు.. వెతికిపెట్టండి

మహేశ్వరం: తుమ్మల చెరువు జాడ కనిపించట్లేదని పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో 8 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు కనిపించట్లేదని అందులో పేర్కొన్నారు. కబ్జా చేసి వెంచర్లు వేశారని ఆరోపించారు.

దీంతో పంటలు మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి చెరువు ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామని గ్రామస్థులు ఆరోపించారు.

**మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేత...** రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఆక్రమణల కూల్చివేతలను చేపట్టారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను శేరిలింగంపల్లి రెవెన్యూ సిబ్బంది కూల్చివేసింది.

పోలీసు బందోబస్తు మధ్య ఎకరా భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించారు.




# నన్ను అనర్హురాలిగా ప్రకటించే అధికారం యూపీఎస్సీకి లేదు: పూజా ఖేడ్కర్

దిల్లీ: అధికార దుర్వినియోగం, తప్పుడు ధ్రువీకరణ పత్రాల సమర్పణ వ్యవహారంలో ఆ మధ్య ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్ పేరు మీడియాలో చక్కర్లు కొట్టింది. ప్రస్తుతం ఆమె కేసు దిల్లీ హైకోర్టు పరిధిలో ఉంది. కోర్టు విచారణలో యూపీఎస్సీ చేసిన వాదనలను పూజ తోసిపుచ్చారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు.

యూపీఎస్సీకి తనపై అనర్హత వేటువేసే అధికారం లేదని వాదించారు. "డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌కు మాత్రమే అఖిల భారత సర్వీసుల చట్టం కింద చర్యలు తీసుకునే వీలు ఉంది" అని ఆమె తన వాదన వినిపించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్(%ూబయిు ఖష్ట్రవఎుఖుతీ%)పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ.. ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. దాంతో ఆమెకు ఆగస్టు 29 వరకు రక్షణ లభించింది. ఈ క్రమంలో తాజాగా విచారణ జరిగింది.




దిల్లీ: దేశ ప్రజల సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' పథకానికి నేటితో పదేళ్లు పూర్తయింది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సమ్మిళిత అభివృద్ధికి తోడ్పేందుకు రూపొందించిన ఎన్నో ఆర్థిక పథకాల్లో ఇదీ ఒకటి. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం విజయవంతం చేసిన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. ''సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంతో పాటు కోట్లాది మందికి.. ముఖ్యంగా మహిళలు, యువత, అణగారిన వర్గాలకు గౌరవాన్ని అందించడంలో ఈ పథకం అత్యంత ముఖ్యమైంది. ఇది దేశ ప్రజల గౌరవం, సాధికారత, దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ఎంతో ఉపయోగపడింది" అని ప్రత్యేక పోస్టులో ప్రధాని పేర్కొన్నారు. దేశంలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడటం జన్‌ధన్ పథకం ప్రధాన లక్ష్యం. "మీలో చాలా మంది ముఖ్యంగా యువత.. ఈ పథకం ఎందుకు అంత ముఖ్యమైందని ఆలోచిస్తారు..? ప్రస్తుత పరిస్థితుల్లో అన్నింటే ముఖ్యంగా ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండడం ఎంతో ముఖ్యం. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకు దాదాపు ఎన్నో సామాన్య కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు. దీని వల్ల సామాన్యుల సొత్తు చోరీ గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఆర్థిక భద్రత లేకపోవడంతో ప్రజల ఆశలు కలలుగా మిగిలేవి" అని అన్నారు. "జన్‌ధన్ యోజన ప్రారంభించినప్పుడు.. దాని చుట్టూ ఉండే సమస్యలు, సందేహాలు నాకు ఇంకా గుర్తున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం సాధ్యమవుతుందా..? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. కానీ, ఈ ప్రయత్నం మంచి మార్పుకు దారి తీస్తుందని నమ్మాను. 53 కోట్ల మందికి పైగా ప్రజలు బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారు. ఇది ఊహించని పరిణామం. ప్రస్తుతం ఈ ఖాతాల్లో డిపాజిట్ల బ్యాలెన్సు రూ. 2. 3 లక్షల కోట్లు. వీటిలో 65 శాతానికి పైగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల వారు ఉండడం విశేషం. అంతేకాకుండా ఈ పథకం ద్వారా మహిళా సాధికారతను సాధించాం. దాదాపు 30 కోట్ల మందికి పైగా మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురాగలిగాం" అని ప్రధాని పేర్కొన్నారు.

# యుద్ధాలతో పోలిస్తే.. రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు: గడ్కరీ



దిల్లీ: యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి" అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబులెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్‌లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు వేగంగా స్పందించడంతోపాటు.. కట్టర్ల వంటి అధునాతన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

# బోనస్ చెల్లిస్తామన్న మాటను బోగస్ చేశారు..



హైదరాబాద్: ఆహార పంటల బదులు పప్పుధాన్యాల సాగుతో మెరుగైన లాభాలు సాధించ వచ్చన్న రైతుల ఆశలు అడియాశలు చేసేలా మీ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటా పెసరకు మద్దతు ధర రూ. 8,682 ప్రకటించినప్పటికీ ఆ ధరకు ఎవరూ కొనుగోలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు పంటను క్వింటా రూ.6,000 నుంచి రూ.6,500 మధ్యనే రైతులు విక్రయిన్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారులు ఆడిందే ఆటగా మారటంతో రైతులు క్వింటాకు రూ.2,500 పైగా నష్టపోతున్నారన్నారు. ఈ సంవత్సరం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీష్ రావు తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం ప్రదర్శించడం పెసర పంట రైతులకు శాపంగా మారిందన్నారు. కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించే పరిస్థితి లేదని ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నారాయణ పేట, సూర్యపేట తదితర జిల్లాల రైతులు తీవ్ర ఆవేదన, ఆందోళన చెందుతున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే రుణమాఫీ, రైతు బంధును అటకెక్కించిన మీ ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తామన్న మాటను బోగస్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మంగళం పాడారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అదే తీరుగా ఇప్పుడు మద్దతు ధర ప్రకారం పంటలు కొనుగోలు చేసే బాధ్యతను విస్మరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలు పండించడం, పండించిన పంటలను విక్రయించుకోవడం రైతన్నకు కత్తిమీద సాముగా మారిందన్నారు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలు, జిల్లాల్లో తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా చూడాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com